ప్రజాశక్తి

గురువారం 29 మే 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

భగత్‌సింగ్ కాలనీవాసులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

స్మార్ట్ మీటర్లు బిగించొద్దు..

- ఏర్పాటును అడ్డుకున్న భగత్‌సింగ్ కాలనీవాసులు..
- గృహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అత్యంత భారం
- సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

గృహాలకు స్మార్ట్‌మీటర్లు బిగించే ప్రక్రియను ఒంగోలు నగరంలోని భగత్‌సింగ్ కాలనీ వాసులు బుధవారం అడ్డుకున్నారు. బుధవారం ఉదయం అదానీ కంపెనీకి చెందిన ప్రతినిధి విద్యుత్ సిబ్బందితో కలిసి భగత్‌సింగ్ కాలనీకి చెందిన మూడు గహాలకు తొలుత స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఉపక్రమించారు. తమ నివాసాలకు ఉన్న మీటర్లు పని చేస్తున్నాయని, స్మార్ట్ మీటర్లు వద్దని కాలనీ వాసులు చెప్పారు. మీటర్‌కు డబ్బు చెల్లించవలసిన అవసరం లేదని, ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రతినిధి, సిబ్బంది నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇంత అర్జెంట్‌గా మీటర్లు మార్చవలసిన అవసరం ఏముందని కాలనీవాసులు శ్రీను, వంశీధర్, డేవిడ్ ప్రశ్నించారు. సమాచారం తెలుసుకున్న సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు తదితరులు అక్కడకు చేరుకొని సిబ్బందితో మాట్లాడారు. 'స్మార్ట్‌మీటర్లు ఎవరు ▶ 2లో

పొగాకు వ్యాపారులపై

ప్రభుత్వ నియంత్రణ ఏదీ.?

- పంట లక్ష్యాలకు మించి పండకపోయినా కొనుగోళ్లలో సంక్షోభం
- వ్యాపారులను కట్టడి చేయడంలో వైఫల్యమే ఈ దుస్థితికి కారణం
- ఎగుమతులు లేవంటూ ధరలను దిగజార్చడంతో రోడ్డెక్కిన రైతులు

యద్దనపూడిలో నల్లబర్లీ పొగాకు మండెలను పరిశీలిస్తున్న ఓ కంపెనీ ప్రతినిధులు (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పొగాకు అంతర్జాతీయ వాణిజ్య పంట గా ఉంది. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లోనే పొగాకు పండుతుంది. రాష్ట్రంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోనే ఎక్కువగా సాగవుతుంది. పొగాకు వ్యాపారులను నియంత్రించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కేంద్రం పొగాకు బోర్డును ఏర్పాటు చేసింది. దీని కేంద్ర కార్యాలయం గుంటూరులో ఉంది. ఏటా పంట లక్ష్యాలు నిర్ణయించడం, వ్యాపారుల నుంచి ఇండెంట్లు తీసుకోవడం, తదనుగుణంగా వేలంలో కొనుగోలు చేయించడం వంటి కార్యకలాపాలు పొగాకు బోర్డు పర్యవేక్షించాల్సి ఉంది. ఇందుకోసం యంత్రాంగం కూడా ఉంది. పొగాకు రైతులకు ఏటా ఎందుకు గిట్టుబాటు ధర రావడం లేదు? ఎందుకు రోడ్డెక్కుతున్నారు? నష్టాలపాలవుతూ ఎందుకు ఆత్మహత్యల బాట పట్టారన్నదే ఆలోచించాలి. ప్రారంభంలో ఐటీసీ అద్దె భవనాల్లో వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించిదని సీనియర్ రైతు నాయకులు గుర్తు చేస్తున్నారు. ఈ రోజున ఐటీసీ ఆస్తులు ఎన్ని రూ.వేల కోట్లు? ఎన్ని రూ.హోటళ్ళు పెట్టారు? ఎన్ని రకాల వ్యాపారాలు సాగిస్తున్నారంటే అందుకు కారణం పొగాకు రైతుల శ్రమే.. వారి కష్టమే.. ఐటీసీ రూ.వేల కోట్ల టర్నోవర్ చేస్తోంది. దాన్ని పండించిన పొగాకు రైతులకు మాత్రం గిట్టుబాటు ధరల్లేక ఏటా మంత్రులు, ఎమ్మెల్యేలు, రైతుసంఘాల నేతలకు పనిపెడుతున్నారు. వేలం కేంద్రాల చుట్టూ తిరగడం తంతుగా మారింది. దీనంతటికీ కారణం వ్యాపారుల గత్తాధిపత్యమే.. అందుకు కీలకపాత్ర పోషించే ఐటీసీదే. వాస్తవానికి ఐటీసీపై కేంద్రం గానీ, రాష్ట్రం గానీ నియంత్రణ చేసే పరిస్థితి ఉందా? లేదా.? లేదనే చెప్పాలి. అందుకే చేతులెత్తేశారు. ఏటా ఉండే సమస్యే కదా? అనే భావనతో కాలం వెళ్లబుచ్చుతారు. వ్యాపారులు తమకు అవసరమైనంత పొగాకును పండించేలా రైతులను ప్రోత్సహిస్తారు. ఇండెంట్లు కూడా బోర్డుకు ఇస్తున్నారు. అయితే ఎందుకు కొనుగోలు చేయరని ప్రశ్నించే పరిస్థితి ప్రభుత్వంలో లేదు. అందుకే వ్యాపారులు సిండికేట్‌గా మారి సీలింగు ధరలు అమలు చేస్తుంటారు. రైతులు నెలల తరబడి ఆందోళనలు చేస్తున్నారు. వేలం చివరి వరకూ ఏదో రకంగా మాటలతోనే కాలయాపన చేస్తారు. నెల రోజుల క్రితమే మంత్రులు వేలం కేంద్రాలు సందర్శించారు. ఎటువంటి ▶ 2లో

ఆర్టీసీ భూములు ప్రైవేటుపరం.!

- 33.45 ఎకరాలు ఆర్‌టిసిలో లీజుకు ఇచ్చేందుకు సిద్ధం
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 9 చోట్ల 18.36 ఎకరాలు..

ఒంగోలు ఆర్‌టిసి బస్టాండ్ ఎదుట గతంలో లీజు పొందిన వారు నిర్మించిన భవనాలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆర్‌టిసి ఆస్తులను లీజు పేరుతో ప్రైవేటు పరం చేసే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. ఎపిటిటిడి-3వ(నెల్లూరు) జోన్ పరిధిలోని ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలోని 26 ప్రాంతాల్లో (బస్సు స్టాండ్, డిపో, ఆర్ టి సి ఖాళీ స్థలం) స్థలాలు 15 సంవత్సరాల లీజు పేరున బిడ్డింగ్‌కు టెండర్లు పిలిచారు. నెల వారీ లీజు పద్ధతిన ప్రైవేట్ వ్యక్తులకు కట్టపెట్టే దిశగా ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ పాటికే రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసి స్థలాలు 33 సంవత్సరాల లీజు పేరున వందల కోట్ల విలువైన భూములను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారు. గతంలో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు అధిక మొత్తంలో ఆర్‌టిసి స్థలాలు అయిన వారికి కట్టబెట్టినట్లు విమర్శలున్నాయి. కాగా తాజాగా 3వ జోన్ పరిధిలో కోట్లాది రూపాయల విలువైన 33.45 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించనున్నారు.

ఉమ్మడి ప్రకాశంలో 18.36 ఎకరాలు..

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తొమ్మిది ప్రాంతాల్లో 18.36 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తులకు లీజు పేరున ధారాదత్తం చేయనున్నారు. వీటిలో చీరాల పట్టణంలోని ఆర్ టిసి డిపో (గేరేజ్)లో ఖాళీగా ఉన్న 52,950 చదరపు గజాలు అనగా 10.94 ఎకరాలు రూ.5,29,500 లీజ్ (నెల) లెక్కన ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చేందుకు టెండర్లు పిలిచారు. కాగా ఇంకొల్లు లో డిపో ఏర్పాటు అవసరాలకు గతంలో సేకరించిన ఖాళీ స్థలం 24,200 చదరపు గజాలు అనగా 5 ఎకరాలు రూ.2,99,500 లీజ్ పద్ధతిన టెండర్ పిలవడం గమనార్హం. ఇదిలా ఉండగా వేటపాలెం బస్టాండ్‌లోని 2619 చదరపు గజాలు (54.11 సెంట్లు) రూ.35000 లీజుకు పిలిచారు. ఉలవపాడు బస్సు స్టాండ్ ముందు (ప్రస్తుతం నెల్లూరు జిల్లా) 556 చదరపు గజాలు (11.48 సెంట్లు) రూ.10 వేల లీజుకు టెండర్ పిలిచారు. ప్రకాశం జిల్లాలో కనిగిరి డిపో పరిధి లోని పామూరు బస్టాండ్‌లోని 2 స్థలాలు 3654 చదరపు గజాలు (75.08సెంట్లు) రూ.1.22 లక్షలు లీజుకు కనిగిరి ఆర్ టి సి బస్సు స్టాండ్ ముందున్న 333.3 చదరపు గజాలు (6.88సెంట్లు) రూ 25 వేల లీజు కు టెండర్ పిలవడం గమనార్హం. ప్రభుత్వ అవసరాలకు ప్రైవేట్ స్థలం, లేదా భవనం లీజు ఒప్పందం 3 లేదా 5 సంవత్సరాలకు కుదుర్చుకున్నప్పుడు ప్రభుత్వ రంగ ఆస్తులు ఏకంగా 15 నుండి 33 ఏళ్ల లీజు ఒప్పంద ప్రక్రియ అనుమానాలకు తావిస్తోంది. లీజు చెల్లింపులు సక్రమంగా సాగితే లీజు గడువు పెంచుకునే సదుపాయం కల్పించడం వెనుక ఆస్తులు ప్రైవేట్ వ్యక్తులకు గుండుగుత్తగా అప్పగించడానికే అన్న విమర్శలు ఉన్నాయి. గతంలో లీజు కుదుర్చుకున్న ప్రైవేట్ సంస్థలు వ్యక్తులు నిర్మించిన శాశ్వత భవన సముదాయాలతో ▶ 2లో

నేడు గ్రేడ్-2 హెడ్‌మాస్టర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-2 హెడ్‌మాస్టర్‌గా ప్రమోషన్ పొందిన వారికి గురువారం కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్ కుమార్ బుధవారం రాత్రి ఒక ప్రకటన లో తెలిపారు. సీనియారిటీ లిస్టులోని 249 వరకు గల అభ్యర్థులు ఒంగోలు, నెల్లూరు బస్టాండ్ సమీపంలోని డిఆర్‌ఆర్‌ఎం స్కూల్‌లో నిర్వహించే కౌన్సిలింగ్‌కు ఉదయం 8 గంటలకల్లా హాజరుకావాలని పేర్కొన్నారు.

నెలాఖరు లోపు

ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- రేషన్ షాపులో స్టాక్ పరిశీలన

డిఎస్‌ఒ, ఆర్డీవోతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జూన్ 1 నుండి రేషన్ షాపుల ద్వారా రేషన్ పంపిణీని చేపడుతున్న నేపథ్యంలో అందుకనుగుణంగా జిల్లాలో రేషన్ షాపుల వెరిఫికేషన్, ఆన్‌లైన్ ప్రక్రియను నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఒంగోలు మండల పరిధిలోని చెరువుకొమ్ము పాలెంలో ఏర్పాటుచేసిన రేషన్ షాపును సందర్శించారు. రేషన్ షాపు వెరిఫికేషన్, ఆన్ లైన్ ప్రక్రియను, సరఫరా చేసిన స్టాక్‌ను స్వయంగా పరిశీలించి, ఎంతమంది కార్డు దారులు వున్నారు, ఎంత రేషన్ సరఫరా చేశారు.? వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ▶ 2లో

పొగాకు వ్యాపారులపై ప్రభుత్వ నియంత్రణ ఏదీ.?

(మొదటిపేజీ తరువాయి)

మార్పులు లేవు. ధరల్లో అదే సీలింగ్ కొనసాగుతోంది. గరిష్ట ధర కిలోకు రూ.280 మించడం లేదు. వేలం మొదటి రోజు నుంచీ ఇదే ధర. పైగా ఈ ధర దక్కే బేళ్ల సంఖ్య రానురానూ తగ్గిపోతాయి. దీంతో సగటు ధరలోనూ తగ్గుదల కొనసాగుతోంది. ఈ ఏడాది వర్జీనియా పొగాకు 167 మిలియన్ కిలోల పంట నిర్ణయించారు. కొనుగోళ్లు మొదలై రెండు నెలలు గడిచింది. సగటు ధర కిలోకు రూ.258 ఉంది. కనిష్ట ధర రూ.200కు పడిపోయింది. పైగా ధరల్లో కోత పెడుతున్నారు. రోజూ 25 శాతం బేళ్లను తిరస్కరిస్తున్నారు. గతేడాది ఈ సమస్య లేదు. ఈ ఏడాది రోజూ తిరస్కరించే బేళ్ల సంఖ్య భారీగా ఉంటుంది. దీంతో వాటిని తిరిగి ఇంటికి తీసుకుపోలేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఇక బర్లీ పొగాకు రైతులూ ఆత్మహత్యల బాట పట్టే పరిస్థితి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం కొంత కళ్లు తెరిచింది. మార్టూరులో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రైతులతో ముఖాముఖి పెట్టారు. మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్ హాజరై రైతుల గోడు విన్నారు. వ్యాపారులపై ఒత్తిడి పెంచారు. కొనుగోలుకు అంగీకరించారు. బర్లీ పొగాకు ఈ ఏడాది 53 మిలియన్ కిలోల పండిందని వ్యాపారులు చెబుతున్నారు. ఈ పంట పూర్తిగా ఎగుమతి చేస్తారు. విదేశాల నుంచి ఆర్డర్లు వస్తే కొంటామని వ్యాపారులు చెబుతున్నారు. అంతర్జాతీయ డిమాండుపై ఇది ఆధార పడి ఉంది. దీన్ని కూడా వ్యాపారులే ప్రోత్సహించారు. ఈ పంట ఈ మధ్యకాలంలో పెద్దగా సాగు లేదు. గతేడాది క్వింటా రూ.18 వేల వరకూ వెళ్లింది. దీంతో సాగు గణనీయంగా పెరిగింది. శనగ, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా బాపట్ల జిల్లాలో ఎక్కువగా సాగు చేశారు. ఇప్పుడు బర్లీ రైతులూ ఇబ్బందులు పడుతున్నారు. ఏదేమైనా ఇండెంట్లు ఇచ్చిన వ్యాపారులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒత్తిడి పెంచి కొనుగోలు చేయించాలి. గిట్టుబాటు ధర నిర్ణయించి ఆ ధరకు తగ్గకుండా కొనుగోళ్లపై దృష్టి సారించాలి. పోటీని పెంచేందుకు ప్రభుత్వ రంగసంస్థలూ మార్కెట్‌లోకి వస్తే రైతులకు మేలు జరుగుతుంది.

స్మార్ట్‌మీటర్లు బిగించొద్దు..

(మొదటిపేజీ తరువాయి)

బిగించమన్నారని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ ఎవరు అని ప్రశ్నించడంతో వారు అక్కడి నుంచి ఉడాయించారు.

తడిసినా మీటర్ పాడవదన్నారు..

కె.వంశీధర్

మా మీటర్ బాగానే ఉంది.. మార్చమని మేం కోరలేదు కదా అని సిబ్బందిని ప్రశ్నిస్తే.. 'ఇది స్మార్ట్ మీటర్.. తడిసినా పాడవదు.. అందరికీ బిగిస్తున్నాం మీకూ బిగించాలి' అని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో చూపించాలని నిలదీయగా సిబ్బంది సైలెంట్ అయ్యారు.

కట్టిన రూ.12 వేలు ఎవరిస్తారని ప్రశ్నించా.. గుంజి శ్రీను

మార్చి నెలలో రూ.12 వేలు పెట్టి కొత్త మీటర్ బిగించా. ఇంత అర్జెంట్‌గా మీటర్ ఎందుకు మార్చాలి. రూ.12 వేలు ఎవరు ఇస్తారని అడిగా. ఈ మీటర్‌కు డబ్బులు అవసరం లేదని, ఫ్రీ గానే బిగిస్తామని ఒప్పించే ప్రయత్నం చేశారు. నాకు స్మార్ట్ మీటర్ వద్దని అడ్డుకున్నా..

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రతిఘటించండి..

సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు

వినియోగదారులకు పెనుభారమైన స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ప్రతిఘటించాలని సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు భగత్ సింగ్ కాలనీ వాసులకు సూచించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్ల ప్రక్రియను వ్యతిరేకించిన తెలుగుదేశం అధికారం చేపట్టిన అనంతరం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. ఈ పాటికే దుకాణాలకు, వాణిజ్య సముదాయాలకు స్మార్ట్ మీటర్లు బిగించారని పేర్కొన్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు వల్ల వినియోగదారులు అనేక ఇబ్బందులకు గురవుతారని వివరించారు. సర్‌ఛార్జీల పేరుతో ఈ పాటికే భారమైన విద్యుత్ చార్జీలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తర్వాత రెడ్డింపయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముందుగానే విద్యుత్ కోసం రీఛార్జి చేసుకోవాలని, మీటర్ల తయారీ ఖర్చు సైతం వినియోగదారుడు నెలవారీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. టైమ్ ఆఫ్ ఛార్జీల పేరుతో పగటిపూట రెట్టింపు ఛార్జీలు వసూలు చేసే ప్రమాదం ఉందన్నారు. కంపెనీ ప్రతినిధులు, విద్యుత్ సిబ్బంది ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేస్తారని, వారి మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కావున వినియోగదారుల స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రక్రియను అడ్డగించాలని సూచించారు.

ఆర్టీసీ భూములు ప్రైవేటుపరం.!

(మొదటిపేజీ తరువాయి)

బస్టాండ్‌లు ఉనికి కోల్పోతున్నాయి. వాస్తవానికి దశాబ్దాల క్రితం ప్రజా అవసరాలకు సేకరించిన ఆర్‌టిసి స్థలాలను పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా అభివద్ధి పరచకుండా, ప్రయాణికులకు, లేదా ఆర్‌టిసి సిబ్బంది సౌకర్యాలు కల్పించే దిశగా రెస్ట్ రూమ్‌లు నిర్మించడం, తాగునీరు, టాయిలెట్స్ వంటి అవసరమైన ఏర్పాట్లు చేయకుండా స్థలాలు అన్యాక్రాంతం చేసే ప్రక్రియ పట్ల పలువురు అక్షేపణ వ్యక్తం చేస్తున్నారు.

నెలాఖరు లోపు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తర్వుల మేరకు జూన్ 1వ తేదీ నుండి రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీని చేపడుతున్న నేపథ్యంలో కార్డుదారులందరికీ పంపిణీ చేస్తున్న విషయాన్ని తెలియజేయాలని రేషన్ షాపు డీలర్‌ను ఆదేశించారు. జిల్లాలో రేషన్ షాపుల వెరిఫికేషన్, ఆన్‌లైన్ ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ జిల్లా పౌర సరఫరా శాఖాధికారి పద్మజను ఆదేశించారు. రేషన్ షాపుల ఆన్ లైన్ నమోదు ప్రక్రియ పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్‌డిఒ లక్ష్మీప్రసన్న, ఒంగోలు తహశీల్దార్ పి.మధుసూదనరావు, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

30న జాబ్‌మేళా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ మరియు జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న ఎన్టీఆర్ సిఎస్‌డి అండ్ డబ్ల్యు మహిళా ప్రాంగణంలో 10కి పైగా బహుళ జాతీయ కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి జె.రవితేజ యాదవ్ బుధవారం తెలిపారు. సంతనూతలపాడు నియోజకవర్గం మరియు ప్రకాశం జిల్లాలో 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల మధ్య గల పదోతరగతి నుంచి పీ.జీ వరకు చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఇంటర్వ్యూలలో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు నెలకు జీతం రూ.12 వేల నుంచి రూ.20 వరకు ఇస్తారని తెలిపారు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
పొదిలి

OS No : 259/2024

కొర్లిమర్ల శ్రీనివాసులు ....వాది
వర్సెస్
భూమా శ్రీనివాసరావు .... ప్రతివాది

To

భూమా శ్రీనివాసరావు S/o చెంచు సుబ్బారావు
R/o ప్లాట్ నెంబర్ S3, మూడవ లైను గుప్తాస్ రెసిడెన్సి, VIP రోడ్ 2nd లైన్,
OPP: బాలినేని శ్రీనివాసురెడ్డి (మాజీ మంత్రి),
ఒంగోలు సెల్ 9246461230
మరియు
భూమా శ్రీనివాసరావు
S/o చెంచు సుబ్బారావు ప్రొప్రైటర్ శ్రీ శ్రీనివాస సాయి ఏజెన్సీ, డోర్ నెంబర్ 30-052-037,
శ్రీరామ హాస్పిటల్ దగ్గర, సత్యనారాయణపురం,
ఒంగోలు .

పై నెంబర్ గల దావాలో వాది (పిటిషనరు) ఎన్నిసార్లు మీకు నోటీసులు పంపినప్పటికీ తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు పత్రిక ప్రకటనకు ఆర్డర్ వేసి ఉన్నారు తేదీ 21-07-2025న ఉదయం 10.30ని మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపగలరు లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
కోలా శివప్రసాద్
అడ్వకేట్, ఒంగోలు,
ప్రకాశం జిల్లా

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
పొదిలి

IA No : 1003/2024
IN
OS No : 259/2024

కొర్లిమర్ల శ్రీనివాసులు ....పిటిషనరు
వర్సెస్
భూమా శ్రీనివాసరావు .... రెస్పాండెంట్

To

భూమా శ్రీనివాసరావు S/o చెంచు సుబ్బారావు
R/o ప్లాట్ నెంబర్ S3, మూడవ లైను గుప్తాస్ రెసిడెన్సి, VIPరోడ్ 2nd లైన్,
OPP:బాలినేని శ్రీనివాసురెడ్డి (మాజీ మంత్రి),
ఒంగోలు సెల్ 9246461230
మరియు
భూమా శ్రీనివాసరావు S/o చెంచు సుబ్బారావు
ప్రొప్రైటర్ శ్రీ శ్రీనివాస సాయి ఏజెన్సీ, డోర్ నెంబర్ 30- 052-037, శ్రీరామ హాస్పిటల్ దగ్గర,
సత్యనారాయణపురం, ఒంగోలు .

పై నెంబర్ గల దావాలో వాది (పిటిషనరు) ఎన్నిసార్లు మీకు నోటీసులు పంపినప్పటికీ తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు పత్రిక ప్రకటనకు ఆర్డర్ వేసి ఉన్నారు తేదీ 21-07-2025న ఉదయం 10.30 ని మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపగలరు లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
కోలా శివప్రసాద్
అడ్వకేట్, ఒంగోలు,
ప్రకాశం జిల్లా

రహదారి మధ్యలో నిలిచిన మురుగునీరు

మురుగునీటితో ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి - కొత్తపట్నం

కొత్తపట్నం నుంచి పల్లెపాలెం బీచ్ కు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారిని సిమెంట్ రోడ్డుగా నిర్మించారు. రహదారి మధ్యలో డివైడర్ కోసం ఖాళీగా ఉంచారు. డివైడర్ నిర్మించక పోవడంతో ఆస్థలంలో గుంతలు ఏర్పడ్డాయి. వర్షపు పడినప్పుడల్లా గుంతల్లో నీరు నిలుస్తోంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజలు ్లతోంది. దోమలు కూడా వ్యాప్తి చెందాయి. దోమల వల్ల ఎక్కడ రోగాల భారీన పడాల్సి వస్తుందోనని ప్రజలు భయాందోళన చెందు తున్నారు. అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేయించి దోమల భారీ నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పేరు మార్పు / సవరణ

నేను కందుల రవీంద్ర, S/o కందుల చిన్న సుబ్బారెడ్డి, నివాసం: పందువనగులవరం, వెలిగండ్ల, ప్రకాశంజిల్లా.

నా యొక్క కుమారుడి పేరు ప్రస్తుత ఆధార్‌లో కందుల దశ్విన్‌రెడ్డి అని నమోదు కాబడినది. ఇప్పుడు పేరుమార్పు/ సవరణ చేయగా **కందుల నాగ ధనిష్‌రెడ్డి** S/o **కందుల రవీంద్ర (Kandula Naga Dhanish Reddy S/o Kandula Ravindra)** గా మార్పు చేయబడినది. నేటి నుండి నా కుమారుడి పేరు **కందుల నాగ ధనిష్ రెడ్డి** గా పిలవబడును.

CHANGE OF NAME

I, **SHAIK MOHAMMAD RAFI** (Old name), S/o **SHAIK NAYAB RASOOL** resident of H.No.3-25, Tahsildar Office Area, Podili Town, Prakasam District - - 523240, Andhra Pradesh, India
I Have Changed my name as
SHAIK MAHAMMED RAFI (New Name)
S/o **SHAIK NAYAB RASOOL**
Hereafter my name is known as
SHAIK MAHAMMED RAFI (New Name)
S/o **SHAIK NAYAB RASOOL**

MARKAPURU MUNICIPALITY

e-procurement tender notice Roc.No.76-2022-E1, Dt 28-05-2025
NIT.No.18/2025-26 to 26/2025-26 (Nine Works Only)
General Funds-Rs.36.00Lakhs

Further details can be seen at e-procurement Market place in www.ape-procurment.gov.in officer inviting bids Commissioner, Markapur Municipality, Markapur, Andhra Pradesh.
Ph. 9704111535

Sd/ xxxxxxx
COMMISSIONER
MARKAPURU MUNICIPALITY

గ్రామ పంచాయతీ కార్యాలయం
పందిళ్ళపల్లి, వేటపాలెం మండలం

RC నెం :- **09/2025** **టెండర్ ప్రకటన** తేదీ: **29-05-2025**

బాపట్ల జిల్లా, వేటపాలెం మండలం, పందిళ్ళపల్లి గ్రామ పంచాయతి తేది 01-07-2025 నుండి తేది: 30-06-2026వ సంవత్సరం వరకు (ఒక సంవత్సర కాలానికి) కాంట్రాక్టు గా గ్రామ పంచాయతీ నందు పనిచేయుటకు గాను ఈ దిగువ తెల్పిన సిబ్బంది సీలు వేసిన టెండర్లను తేది 07-06-2025ఉదయం 12 గం.ల నుండి మధ్యాహ్నం 3 గం.ల వరకు ఈ దిగువ సంతకం దారు వద్దగాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని పందిళ్ళపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద స్వీకరించబడును. సదరు సీలు వేసిన టెండర్లను అదేరోజు అదే ప్రదేశములో సాయంత్రం గం.3.30 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. ఆసక్తిగలవారు ఆయా ఐటమ్‌కు ఎదురుగా చూపబడిన ధరావత్తు చెల్లించి టెండరులో పాల్గొనవచ్చును. ధరావత్తు చెల్లించని మరియు సకాలంలో రాని టెండర్లు స్వీకరించబడవు. ఏకారణం చూపకుండానే టెండర్లు వాయిదా వేయుటకు లేదా రద్దు చేయుటకు పంచాయితీ కార్యదర్శికి అధికారం కలదు. మిగిలిన విషయాలు ఆఫీసు పనివేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	సరఫరా వివరము	చెల్లించివలసిన ధరావత్తు ఒక్కొక్కరికిమొత్తం
1.	తేదీ 01-07-2025 సం.నుండి 30-06-2026వరకు రోజువారి కూలీపై పనిచేయుటకు (టర్న్ కాక్ ..1 పోస్టు)	100/-
2.	తేదీ :01-07-2025వ సం.నుండి 30-06-2026వరకు రోజువారి కూలీపై పనిచేయుటకు (ఎలక్ట్రీషియన్...1. పోస్ట్)	100/-
3	తేదీ :01-07-2025వ సం.నుండి 30-06-2026 వరకు రోజువారి కూలీపై పనిచేయుటకు (కాంట్రాక్టు స్వీపర్సు ...12 పోస్టులు)	100/-
4.	తేదీ : 01-07-2025వ సం.నుండి30-06-2026వరకు రోజువారి కూలీపై పనిచేయుటకు (ట్రాక్టర్ డ్రైవర్ ...1 పోస్టు)	100/-
5.	తేదీ :01-07-2025 వ సం.నుండి30-06-2026 వరకు రోజువారి కూలీపై పనిచేయుటకు(శానిటరీ మేస్త్రి...1 పోస్టు)	100/-
6.	తేదీ :01-07-2025వ సం.నుండి 30-06-2026 వరకు రోజువారి కూలీపై పనిచేయుటకు(NMR బిల్లు కలెక్టర్ ...1 పోస్టులు)	100/-
7.	తేదీ :01-07-2025వ సం.నుండి 30-06-2026 వరకు రోజువారి కూలీపై పనిచేయుటకు(వాచ్ మెన్ ....1 పోస్టు)	100/-

గమనిక :- 1. పై పోస్టులు శ్రీయుత జిల్లా పంచాయతీ అధికారి బాపట్ల జిల్లా వారి ఉత్తర్వులకు లోబడి అమలులోకి వచ్చును .జిల్లా పంచాయతీ అధికారి ఆమోదం ఉత్తర్వుల మేరకు పేమెంటు చెల్లించబడును.
2.పంచాయితీ నిధుల సమృధిగా ఉన్నప్పుడు మాత్రమే జీతాలు చెల్లింపులు చేయబడును.
3.టెండర్లకు సంబంధించిన ఏ విషయములోనైననూ ఏన్యాయ స్థానంలో ఫిర్యాదు చేయరాదు.
పంచాయితి కార్యదర్శి గారిచే ఎప్పటికప్పుడు జారీ చేయబడు ఆదేశాలను టెండరుదారు తప్పక పాటించవలెను.

సం/- టి.మాల్యాద్రిరావు
పంచాయతి కార్యదర్శి, పందిళ్ళపల్లి,
వేటపాలెం మండలం, బాపట్ల జిల్లా.

ప్రజాశక్తి
గురువారం 29 మే 2025

ఎండియు వాహనాల రద్దుతో

పేదల్లో ఆందోళన

ప్రజాశక్తి-పీసీపల్లి

ఎండియు వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం జూన్ నుంచి తీసివేస్తున్నట్లు ప్రకటించడంతో పేదలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం, కందిపప్పు లాంటివి ఇంటింటికి వచ్చి అందజేస్తున్నారు. అనేకమంది పేదలు రేషన్ దుకాణాల వద్దకు వెళ్లకుండానే సరుకులు అందేవి. కొన్ని చోట్ల రెండు నుంచి మూడు కిలో మీటర్ల దూరంలో రేషన్ షాపులు ఉన్నాయి. ఈ వాహనాలు రద్దు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల ప్రధానంగా పేదలు, వృద్ధులు ఆందోళన చెందుతున్నారు.

మారెళ్ళ రేషన్ షాప్ పరిధిలో నాలుగు కిలోమీటర్ల దూరంలో అయ్యావారిపల్లి గ్రామం ఉంది. ఈ గ్రామాన్ని నుంచి మారెళ్ల రావాలంటే నాలుగు కిలోమీటర్లు నడవాలి. మధ్యలో వాగు ఉంది. సరైన రోడ్డు సౌకర్యం లేదు. వర్షాకాలంలో రావాలంటే సుమారు 7 కిలోమీటర్ల దూరం ఉంటుంది. మారేళ్ళకు రావాలంటే, పిసిపల్లి మీదుగా లేదా నేరేడుపల్లి మీదుగా రావాలి.

వెంగళయపల్లి షాప్‌కు మిట్టపల్లి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంది. అక్కడి నుంచి వెంగళాయపల్లి రావాలంటే మీరు కూడా ఇబ్బంది పడేవారు. మిట్టపల్లి ప్రజలు గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో రేషన్ షాపును విడగొట్టి మిట్టపల్లిలో ఒక షాపులు ఏర్పాటు చేయాలని కూడా అర్జీ ఇచ్చారు. వాహనం గ్రామానికి రావడంతో వారు ప్రత్యేక షాప్ కోసం పెద్దగా పట్టించుకోలేదు. ఇంటి వద్దకే బియ్యం వస్తున్నాయని

ఇంటి వద్దే రేషన్ తీసుకుంటున్న దృశ్యం (ఫైల్)

ఆనందం ఉన్నారు. కానీ ఇప్పుడు వాహనాలు రద్దు చేశామని చెప్పడంతో మీరు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలి వుండగా , అలా కాకుండా ఉన్న సౌకర్యాల్ని తొలగిస్తున్నారని చెప్పడంతో ఆందోళన చెందుతున్నారు.

ఎండియు వాహనాలతో ఎంతో మేలు

- అత్యాల మోషే, ఆదిఆంధ్ర కాలనీ, పెదయిర్లపాడు

మా గ్రామంలో 50 కుటుంబాలు ఉన్నాయి. మేమందరం దళితులం. కూలిపనులకు వెళుతాము. గతంలో పెద్ద ఇర్లపాడు వెళ్లి షాపు వద్ద నుంచి తెచ్చుకున్నందుకు ఇబ్బంది పడేవారం. తర్వాత ఇళ్లవద్దకు వచ్చి బియ్యాన్ని వాహనం ద్వారా అందజేశారు. ఇది మాకు చాలా ప్రయోజనకరంగా ఉంది. వాహనాలు కొనసాగించాలి.

రేషన్ కోసం 2 కిలోమీటర్లు నడవాలి

- కురణం మహా లక్ష్మయ్య, మిట్టపల్లి

మా రేషన్ షాపు వెంగళాయపల్లి లో ఉంది. రెండు కిలోమీటర్ల దూరం. వాహనాలు తీసేస్తే రెండు కిలో మీటర్లు నడిచి వెళ్లి రేషన్ తెచ్చుకోవాలి. వర్షాకాలంలో బియ్యం తెచ్చుకునేందుకు వెళ్లి రావాలన్నా ఇబ్బందులు ఉన్నాయి. కావున ప్రభుత్వం వాహనాలు కొనసా గిస్తే మాకు ఎంతో మేలుగా ఉంటుంది.

వృద్ధులు వికలాంగులు షాపు వద్దకు వెళ్లి తెచ్చుకునేందుకు చాలా ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు ఇంటి ముందుకు వచ్చి బియ్యాన్ని ఇచ్చేటప్పుడు వృద్ధులు వికలాంగులు ఇంట్లో సరుకులు చేర్చు కోలేకపోతే వాహనదారులే ఇంట్లో బియ్యం మూట పెడుతుంటారు. ఇలాంటి సౌకర్యం ఈ వాహనాల ద్వారా ఉంది. మరి కొంతమంది పేదలు రేషన్ దుకాణాల వద్దకు వెళ్ల సరుకులు తెచ్చుకునేందుకు ఒక పూట సమయం వృధా అవుతుంది. ఇంటి ముందు నిలబడినప్పుడు ఇంట్లోనే వ్యక్తులు ఎవరో ఒకరు వెళ్లి వేలు ముద్ర వేసి బియ్యాన్ని తీసుకుంటారు. ఇప్పుడా ఆ అవకాశం లేకుండా పోయింది.

ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

డిజిపేటలో డిఎల్‌పిఒ విచారణ

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

మండలంలోని డిజిపేటలో కనిగిరి డిఎల్‌పివో హనుమంతరావు బుధవారం విచారణ చేపట్టారు. డిజిపేటలో పంచాయతీ నిధులలో అక్రమాలకు పాల్పడ్డారంటూ గ్రామానికి చెందిన పి.తిరుపతయ్య, వి.ప్రసాదు, జి.తిరుపతయ్య, బి.సుబ్బారావు పలువురు గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై డిఎల్‌పిఒ హనుమంతరావు ఈ నెల 17వ తేదీన విచారణ చేపట్టి ఫిర్యాదుదారులను విచారించిన విషయం విదితమే. ఈ ఫిర్యాదుపై బుధవారం మరోసారి విచారణ చేపట్టారు. పంచాయతీ పరిధిలో చేపట్టిన పనులను పరిశీలించి ఆయా గ్రామస్థులను విచారించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు డిఎల్‌పిఒ హనుమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ వెంకట రమణయ్య, కార్యదర్శి రమణ నాయక్, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

పామూరులో క్షుద్ర పూజల కలకలం

ప్రజాశక్తి-పామూరు

పామూరులో క్షుద్ర పూజలు చేసినట్లుగా ఉన్న ఆనవాళ్లు కలకలం రేపాయి. పామూరు పట్టణం విరువూరు రోడ్డులో ఉన్న ఆర్‌ఎల్ రియల్ ఎస్టేట్ కార్యాలయం ముందు పూజల ఆనవాళ్లు ఉన్నాయి. కార్యాలయం ముందు పసుపు, కుంకుమతో ముగ్గు వేసి నిమ్మకాయలను కోసి మధ్యలో కోడిగుడ్డు పెట్టారు. పట్టణంలో క్షుద్రపూజలు జరిగాయనే విషయం కలకలం సృష్టించింది. గత ఆరు నెలల నుంచి మండల పరిధిలోని పలు ప్రాంతాలలో ఇలా జరుగుతున్నాయని పలువురు తెలిపారు. క్షుద్ర పూజలు పేరుతో ప్రజలను ఆందోళన గురి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పామూరు పట్టణానికి చెందిన రియల్టర్ షేక్ రసూల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. వ్యాపారంగా తనను దెబ్బ కొట్టేందుకు ప్రత్యర్థులు ఇలాంటి పనులు చేసి ఉంటారని ఆయన తెలిపారు. తనపై దుష్ప్రచారం, క్షుద్రపూజల వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రసూల్ తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

తల్లీకొడుకులకు తీవ్ర గాయాలు

గాయపడిన జోయల్

ప్రమాదంలో ధ్వంసమైన కారు

ప్రజాశక్తి-చీరాల

ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో తల్లీ కుమారులకు తీవ్రగాయాలైన సంఘటన చీరాల ఒంగోలు జాతీయ రహదారిపై అక్కయ్యపాలెం జంక్షన్ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. చీరాల మండలం శాంతినగర్‌కు చెందిన ఐనంపూడి రత్నకుమారి దంపతులు వేటపాలెం మండలం చల్లారెడ్డి పాలెంలో ఇటీవల ఇల్లు అద్దెకు తీసుకొని నివాసం ఉంటూ నాటు కోళ్లు పెంచుతూ జీవనం సాగిస్తున్నారు. నాగులప్పపాడు మండలం నిడమానూరు గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి రామాంజనేయులు బాపట్లలోని తన స్నేహితుడు కలుసుకునేందుకు వెళ్లి తిరిగి నాగులుప్పపాడు ప్రయాణిస్తున్నాడు. చీరాల ఒంగోలు 216 జాతీయ రహదారిలో వేటపాలెం మండలం, అక్కయిపాలెం పంచాయతీ జంక్షన్ వద్ద కారు ద్విచక్ర వాహనం రెండు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తల్లి రత్నకుమారికి కుమారుడు జోయల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అయితే అదే సమయంలో అటుగా వెళుతున్న చినగంజం తహశీల్దార్ ప్రభాకర్‌రావు సంఘటన స్థలానికి చేరుకోని ప్రమాద తీరును స్థానికులును అడిగి తెలుసుకున్నారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే జోయల్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా అవుట్ పోస్ట్ పోలీసులు క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం

రాకపోకలకు ఆటంకం

ప్రజాశక్తి-పీసీపల్లి

రోడ్డు మధ్యలో స్తంభం

రోడ్డు మీదే విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మండలంలోని కమ్మవారిపల్లెలో గ్రామానికి పడమర వైపు నుంచి కొప్పు కొండకు వెళ్లే నలభై అడుగులు రోడ్డు ఉంది. ఈ రోడ్డు చాలా ప్రాధాన్యత కలిగిన రోడ్డు. పూర్వం నుంచి ఈ దారిలో పామూరు మండలం బల్లిపల్లి, ఎర్రబల్లికు వెళ్ళే ప్రధానమైన దారి. గతంలో బస్సులు, వాహనాలు, లేని రోజుల్లో మండల వాసులు కొండమీదగా ప్రయాణించేవారు. ఈ రోడ్డునే గడ్డి తెచ్చుకునేందుకు వెళ్లేవారు. ఎడ్ల బండ్లు కూడా పోయేవి. అంతటి ప్రాధాన్యత కలిగిన ప్రభుత్వ డొంక రోడ్డు మీద ఈ మధ్యకాలంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలను ఈ రోడ్డులో ఏర్పాటు చేశారు. గ్రామస్తులు అందరూ కూడా రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం వేస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ ఈ రోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఒక పక్క వైపు మార్చాలని కోరుతున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రోడ్డుమీద ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం తొలగించాలని కోరుతున్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి-వెలిగండ్ల

ప్రతిరోజు యోగా చేయడంతో ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా రెండో రోజు హైస్కూల్‌లో ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో యోగా శిక్షణా తరగతులు నిర్వహిం చారు. యోగా శిక్షకులు మాట్లాడుతూ సెల్ ఫోన్ వినియోగం పెరిగి ప్రతి ఒక్కరు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ప్రతిరోజు కొంత సేపు యోగా చేయడం ద్వారా ఒత్తిడి తగ్గుతుందన్నారు. అనంతరం వివిధ శాఖల ఉద్యోగులచేత యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఒంగోలు అన్నమ్మ పాల్గొన్నారు.

యోగా చేస్తున్న అధికారులు

బైకులను ఢీకొన్న ఆటో

వ్యక్తి మృతి.. మరొకరికి గాయాలు

ప్రజాశక్తి-అద్దంకి

గాయపడిన వెంకట్రావు

అతివేగంతో ఆటో రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన ఘటనలో యువకుడు అక్కడకక్కడే మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కొరిశపాడు మండలం తమ్మవరం గ్రామానికి చెందిన తాటికొండ వెంకట్రావు(40), మరో వ్యక్తితో కలసి సింగరకొండ భవనాసి చెరువు వద్ద చేపలు పట్టుకొని భవాని సెంటర్లోని తన దుకాణంలో అమ్ముకోవటానికి ద్విచక్ర వాహనాలపై వస్తున్న క్రమంలో నామ్ ఎక్స్ప్రెస్ వే ద్వారకా నగర్ సమీపంలో వెనుక నుంచి ద్విచక్రవాహనాలను ఢీకొనడంతో వెంకట్రావు అక్కడికక్కడే మృతి చెందాడు. అద్దంకి మండలం కలవకూరు గ్రామానికి చెందిన లక్ష్మీపతి తీవ్ర గాయాలు కాగా వెంటనే 108 వాహనం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాద ఘటన సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఘటన వివరాలను సేకరించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-మద్దిపాడు

గుండ్లకమ్మ కుడి కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన సంఘటన మండల పరిధిలోని సీతారాంపురం గ్రామ సమీపంలో బుధవారం జరిగింది. ఎస్ఐ శివరామయ్య వివరాలు ప్రకారం.. గ్రామంలోని గుండ్లకమ్మ కుడి కాలువలో మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయసు 65 నుంచి 70 సంవత్సరాలు ఉంటాయని, చర్మం అంతా ఉబ్బి అక్కడక్కడ ఊడి పోయి ఉందన్నారు. విఆర్వో రిపోర్ట్ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి సమాచారం తెలిస్తే మద్దిపాడు పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

అంకమ్మతల్లి ఆలయంలో చోరీ

వెండి కిరీటం, హుండీలో నగదు అపహరణ

ప్రజాశక్తి-టంగుటూరు

పగులకొట్టిన హుండీ

జరుగుమల్లి మండలంలోని ఎన్ ఎన్ కండ్రిక (కొత్తపాలెం) గ్రామంలోని అంకమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం అర్ధ రాత్రి చోరీ జరిగింది. అమ్మవారి వెండి కిరీటం, హుండీలోని నగదు దోచుకెళ్లారు. గ్రామంలోని మహిళా భక్తులు 2021 సంవత్సరంలో 525 గ్రాములతో చేయించిన వెండి కిరీటం విలువ రూ.70 వేలు ఉంటుందని, హుండీలో నగదు ఎంతో తెలియాల్సి ఉందని తెలిపారు. దేవాలయం తాళం దొంగ చాకచక్యంగా తీయడం గ్రామస్తులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇది తెలిసిన వారి పనేనా? అని గ్రామంలో చర్చించు కుంటున్నారు. ఈ విషయమై జరుగుమల్లి ఎస్ఐని ఫోన్‌లో సంప్రదించగా ఎస్ఐ స్పందించ లేదు.

విచారిస్తున్న పోలీసులు

పెట్లూరు శివాలయంలో చోరీ

వెండి ఆభరణాలు అపహరణ

ప్రజాశక్తి-కొండపి

పెట్లూరు శివాలయంలో లక్షన్నర విలువైన వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఏఎస్ఐ అంకాలరావు తెలిపిన వివరాల ప్రకారం.. పెట్లూరు గ్రామంలో ఉన్న శివాలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. దొంగలు శివాలయంలో ఉన్న హుండీ జోలికి పోకుండా శివుడుపై ఉన్న వెండి ఆభరణాలను అపహరించారు. వెండి ఆభరణాల విలువ సుమారు రూ.1.5 లక్షల ఉంటుందని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఎన్టీఆర్ జయంతి వేడుకలు

బాపట్లలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

పర్చూరులో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

పంగులూరులో ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - బాపట్ల

ఎన్టీఆర్ జయంతి వేడుకలు తెలుగుదేశం నాయకులు ఘనంగా నిర్వహించారు. శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ సూచనల మేరకు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర బాబు ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూల మాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు వడ్లమూడి వెంకటేశ్వర్లు, నాయకులు బూర్లె రామ సుబ్బారావు, శీలం శ్రీనివాసరావు, కొల్లూరి వెంకట్రావు, కుట్టుబోయిన రమేష్, షన్ముఖ, రమేష్, చేజెర్ల సతీష్, అంకాల శ్రీనివాసరావు, అడే వంశీ పాల్గొన్నారు.

అద్దంకి : స్థానిక ఆర్‌టిసి డిపో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతీ నెలా నిర్వహించే ప్రతిభా మూర్తులు, మధుర స్మృతులు కార్యక్రమంలో భాగంగా ఈ నెల రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య ఆర్థిక సహకారంతో ఎన్టీఆర్ 102వ జయంతి బంగ్లా రోడ్డులోని చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి అధ్యక్షత వహించారు. పుట్టంరాజు శ్రీ రామ చంద్రమూర్తి ఎన్టీఆర్ తెలుగు భాషకు చేసిన సేవలు వివరించారు. కార్యక్రమంలో పిసిహెచ్ కోటయ్య, జి శేషగిరి, మహమ్మద్ రఫి, మోటుపల్లి రామదాసు, నిమ్మరాజు నాగేశ్వరరావు, బత్తుల ఆంజనేయులు, గార్లపాటి శ్రీనివాసరావు, మక్కెన హనుమంతరావు, షేక్ మస్తాన్, జ్యోతి రమేష్, మన్నం త్రిమూర్తులు, గాడేపల్లి దివాకర దత్తు, డివిఎం సత్యనారాయణ, ఆర్‌వి రాఘవరావు, అద్దంకి లేవి ప్రసాద్, మలాది శ్రీనివాసరావు, నర్రా శ్రీలక్ష్మి, కొల్లా భువనేశ్వరి, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు, సాహితీ సంస్థల సభ్యులు పాల్గొన్నారు. సినీ సాహితీ విశ్లేషకులు వారణాసి రఘురామ శర్మను ఆర్టీసీ, రోటరీ, సాహితీ కౌముది సంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

యద్దనపూడి : మండలంలోని యనమదల, పోలూరు, అనంతవరం, పూనూరు, యద్దంపూడి, జాగర్లమూడి, వింజనంపాడు, తనుబొద్దివారిపాలెం గ్రామాల్లో తెలుగు దేశం వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకు లు రంగయ్య చౌదరి మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని దేశ రాజధాని ఢిల్లీ స్థాయిలో వినిపించా రని అన్నారు. మొదట ఆయన చిత్ర పటానికి, విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. అన్నాదానం చేశారు. కార్య క్రమంలో టిడిపి వింజనంపాడు అధ్యక్షులు వజ్జ సుబ్బ రామయ్య, మహీధర్ చౌదరి, సుధీర్, బాబురావు, పూనూ రు మాజీ సర్పంచ్ బోయపాటి సాంబశివరావు, పోపూరి శ్రీనివాసరావు, పోలూరి నాయకులు యావల సాంబశివ రావు, అనంతవరం నాయకులు పోపూరి పూర్ణచంద్రరావు, గుత్త వాసు, యనమదల నాయకులు దొడ్డా అప్పారావు, భద్రయ్య, బండారు పల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్చూరు : తెలుగుదేశం వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆబొమ్మలు సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ జన్మదిన కేకును కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. నాగులపాలెం, బోడవాడ, తిమ్మరాజు పాలెం, నూతలపాడు చిననందిపాడు గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాల వద్ద తెలుగుదేశం శ్రేణులు ఎన్టీఆర్ జన్మదిన కేకును కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. బోడవాడలో అన్నదానం చేశారు. చిననందిపాడులో సర్పంచ్ మువ్వా వెంకటశివరావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో బి నాగరాజు, కొత్త సాంబశివరావు, కె శేష గిరిరావు, కె శ్రీనివాసరావు, కె జయలక్ష్మి, నారాయణ, ఎస్ నాగేశ్వరరావు, బి నాగార్జున పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎ శ్రీనివాసరావు ఎస్‌కె గౌస్ బాషా, షేక్ హుస్సేన్, సుభాని, శివరాం ప్రసాద్, జి శ్రీనివాస రావు, శ్రీరామ వెంకట సుబ్బారావు పాల్గొన్నారు. చిననంది పాడులో అన్నదానం చేశారు. పర్చూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్, ఈఒపిఆర్డి కె సత్యనారాయణ, పిఆర్ ఎఇ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఎపిఒ రమేష్, కార్యదర్శి పి సురేష్ కుమార్ పాల్గొన్నారు.

రేపల్లె : టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీఆర్ 102వ జయంతి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారికంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలను టిడిపి పట్టణ అధ్యక్షులు గోగినేని పట్టాభి రామారావు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె సాంబశివరావు, చైర్మన్ కట్ట మంగ సుబ్బారావు, వైస్ చైర్మన్ తూనుగుంట్ల విశ్వనాథ్ గుప్తా, సీనియర్ అసిస్టెంట్ రోశయ్య, మున్సిపల్ పారిశుద్ధ్య శాఖ అధికారి ఎ రామచంద్రరావు పాల్గొన్నారు.

పంగులూరు : ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం జరిగాయి. ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడిఒ కె సుమంత్ మాట్లాడారు. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్‌టిఆర్ ఎంతో కృషి చేశారని అన్నారు. సీనియర్ అసిస్టెంట్ కొర్ర పాటి వేణుమాధవ్, కార్యాలయ సూపర్నెంట్ తానికొండ రమేష్, జూనియర్ అసిస్టెంట్ పుల్లారావు, టైపిస్ట్ కృష్ణ, పంచాయతీ సెక్రటరీ బి రాంబాబు, గోపి పాల్గొన్నారు.

ముండ్లమూరు : స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద, పెద్ద ఉల్లగల్లు, వేములబండ, బొప్పూడివారిపాలెం, తూర్పు కంభంపాడు, సుంకరవారిపాలెం, మారెళ్ళ, పసుపుగల్లు గ్రామాల్లో ఎన్‌టిఆర్ 102 వ జయంతి వేడుకల సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాలకు టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఆయా గ్రామాల్లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యనమాల పిచ్చయ్య, మాజీ సర్పంచులు బేతపూడి బ్రహ్మేశ్వరరావు, మేదరమెట్ల వెంకటరావు, జిల్లెల్లమోడీ చౌదరి, టిడిపి అధ్యక్షులు మేదరమెట్ల పిచారావు, జి రంగనాయకులు, బి నారాయణరావు, మేదరమెట్ల వీరనారాయణ, ముప్పాళ్ళ కోటేశ్వరరావు, మేదరమెట్ల సుబ్బారావు, వాతల సుబ్బారెడ్డి, జిల్లెల్లమోడీ శ్రీను, సుబ్బారావు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాల వేసి నివాళు లర్పించారు. కావూరులో సర్పంచ్ చెల్లి జ్యోతి రవికుమార్ దంపతులు ఎన్టీఆర్ విగ్రహానికి ఘనంగా నివాళు లర్పించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. గూడవల్లి, నడింపల్లి గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు.

యద్దనపూడిలో ఎన్‌టిఆర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

రేపల్లెలో ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న టిడిపి నాయకులు

చెరుకుపల్లిలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న జ్యోతి రవికుమార్

నార్నెవారిపాలెంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - పంగులూరు

నార్నెవారిపాలెంలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నిధులతో నార్నెవారిపాలెంలో సిమెంటు రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలుగుదేశం నాయకులు నార్నె సుబ్బారావు బుధవారం తెలిపారు. గ్రామంలోని బ్రహ్మంగారి గుడి దగ్గర నుండి జాతీయ రహదారి వరకు రూ.10లక్షలతో రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. 150 మీటర్లు, 5.2 మీటర్లు వెడల్పుతో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు నాణ్యత ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు గ్రామంలో పల్లె పండగ పథకం కింద రూ.10లక్షలతో మరో రోడ్డు నిర్మించినట్లు చెప్పారు.

నీటి తీరువా శిస్తు వసూలు చేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మాట్లాడుతున్న ఆర్డీఓ రామలక్ష్మి

రైతుల నుండి నీటి తీరువా శిస్తు వసూళ్లను సిబ్బంది వేగవంతం చేయాలని రేపల్లె ఆర్డీఒ రామలక్ష్మి ఆదేశించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ సర్వేలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం జరుగు తున్న రీ సర్వే పనులు కూడా సర్వేయర్లు రైతుల ను పిలిపించి వారి సమక్షంలో సమస్యలుంటే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. రీ సర్వే రికార్డుల పరిశీలనకు రాని రైతులకు నోటీసులు జారీ చేయాలని అన్నారు. రైతులు భూ సమస్యలు ఎక్కడా పెండింగ్ లేకుండా చూడాలని చెప్పారు. సర్వే పనులు తప్పులు, తడకలు లేకుండా సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. నీటి తీరువా వసూళ్లు 32శాతానికి మించి జరగలేదని, మిగిలిన 68శాతం మరో రెండు నెలల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

వికసించి కనువిందు చేస్తున్న మే పుష్పం

వికసించిన మే పుష్పం

ప్రజాశక్తి - బాపట్ల

స్థానిక జీడి మామిడి పరిశోధన కార్యాలయ ఆవరణలో మే పుష్పం వికసించి చూపరులను కనువిందు చేస్తోంది. కలెక్టరు కార్యాలయానికి వెళ్లే మార్గంలోని జీడి మామిడి పరిశోధన కార్యాలయం ఆవరణలో దర్శనమిస్తున్న మే పుష్పం కలెక్టర్ కార్యాలయానికి వచ్చి, పోయే వారిని విశేషంగా ఆకర్షిస్తోంది.

చీరలు పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

చీరలు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని నూతలపాడు ఆసరా వృద్ధాశ్రమంలో 25 మంది వృద్ధులకు చీరలు, ధోవతులు, పండ్లు బుధవారం పంపిణీ చేశారు. రొటేరియన్ నాగభైరు శ్రీనివాసరావు సోదరి వెలగా వెంకటరత్నం, శ్రీరాం ప్రసాద్ 20వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి కుమార్తె చార్వాణి 25 మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, కార్యదర్శి కోమటి ఆంజనేయులు, పంబి సదానందరెడ్డి, పోలిశెట్టి చంద్రశేఖరరావు, కెఎస్ఆర్‌కె ప్రసాద్, మున్నంగి వెంకటసుబ్బయ్య, భవనం రాజగోపాల్‌రెడ్డి, నాగభైరు శ్రీనివాసరావు, ఆశ్రమ నిర్వాహకులు భవనం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న పంగులూరు కార్యకర్తలు

టిడిపి కార్యకర్తల రక్తదానం

ప్రజాశక్తి - పంగులూరు

తెలుగుదేశం వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా కడప మహానాడులో బుధవారం జరిగిన రక్తదాన శిబిరంలో పంగులూరు తెలుగుదేశం కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో గరిమిడి జగన్మోహనరావు, అలవలపాడు నాయకులు ఎరపనేని ప్రశాంత కుమార్ పాల్గొన్నారు.

30న మండల సమావేశం

ప్రజాశక్తి - సంతమాగులూరు

ఈనెల 30న శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశం హాలు నందు సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ జ్యోతిర్మయి తెలిపారు. రెవెన్యూ, గృహ నిర్మాణం, వ్యవసాయం, ఉపాధి హామీ, వెలుగు, విద్యుత్, విద్య, వైద్యం, ఐసిడిఎస్, పశు వైద్యం, త్రాగునీరు, సాగునీరు, ఉద్యానవనం, పంచాయతీ రాజ్ సంబంధిత శాఖల పనితీరుపై సమీక్ష ఉంటుందని అన్నారు. మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై చర్చింనున్నట్లు తెలిపారు. వేసవిలో నీటి సమస్య, గ్రామాల్లో పేదలకు ఉపాధి కల్పన తదితర శాఖల అధికారులు సమావేశానికి ముందుగా ఆయా శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర నివేదికలు తీసుకుని రావాలని కోరారు.

అంత్యక్రియలు చేసే స్తోమత లేక..

- మార్చురీలోనే భార్య మృతదేహం..
- ఎట్టకేలకు రిమ్స్‌కు అప్పగింత..
- కుమారుడినీ పోషించలేక శిశుగృహకు తరలింపు..

భార్య మృతదేహాన్ని రిమ్స్‌కు అప్పగిస్తూ..అంగీకార పత్రం అందజేస్తున్న పోలయ్య

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భార్య మృతదేహానికి అంత్యక్రియలు చేసే స్తోమత లేక భర్త ఆమె మృతదేహాన్ని రిమ్స్‌లోనే వదిలేసి..వెళ్లిపోయాడు. ఆ మృతదేహం మూడు రోజుల పాటు మార్చురీలోనే ఉంది. ఎట్టకేలకు స్వచ్ఛంద సంస్థలు, అధికారుల జోక్యంతో భర్త అంగీకార పత్రంతో ఆమె మృతదేహాన్ని బుధవారంనాడు రిమ్స్‌కు అప్పగించారు. కుమారుడిని కూడా పోషించే స్తోమత లేదని తండ్రి చెప్పడంతో అధికారులు బాలుడిని శిశు గృహకు తరలించారు.

ఈ నెల 24వ తేదీన కొత్తపట్నానికి చెందిన పొన్నం పోలయ్య భార్య పొన్నం దుర్గమ్మ అనారోగ్య కారణంతో రిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మతిచెందింది. మతురాలికి మూడు సంవత్సరాల బాబు ఉన్నాడు. పొన్నం పోలయ్య, దుర్గమ్మ చిత్తుకాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తుంటారు. స్థిర నివాసం లేకపోవడంతో రైల్వేస్టేషన్, బస్టాండ్, వీధుల్లోనూ ఆశ్రమం పొందుతూ ఉంటారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దుర్గమ్మ ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించడంతో ఈ నెల 24న మతిచెందింది. భార్య పార్థివ దేహానికి దహన సంస్కారాలు చేసే స్తోమత లేక పోలయ్య తన మూడు సంవత్సరాల బాబుని తీసుకొని.. ఆమె మృతదేహాన్ని రిమ్స్‌లోనే వదిలిపెట్టి.. ఆవేదనే ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో ఆమె మృతదేహాన్ని వైద్యసిబ్బంది మూడు రోజుల పాటు మార్చురీలోనే ఉంచారు.

ఏఎన్ఎం, ఆశావర్కర్ ద్వారా విషయం తెలుసుకున్న జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి ఎం.సుగుణ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి.సాగర్‌కు సమాచారం అందించారు. సాగర్ రిమ్స్ హాస్పిటల్ మార్చురీ వద్దకు చేరుకొని.. మతురాలి భర్త పోలయ్యను సంప్రదించగా పోలయ్య తన వద్ద భార్య మృతదేమానికి దహన సంస్కారాలు చేసే స్తోమత కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె పార్థివ దేహాన్ని హాస్పిటల్ వారికి అప్పగిస్తానని చెప్పారు. తాను ఎక్కడెక్కడో చిత్తు కాగితాలు ఏరుకుంటూ ఉంటానని.. వాడిని సంరక్షించడం కూడా తన వల్ల కాదని బాబును కూడా ఎవరికైనా ఇచ్చేస్తానని అని చెప్పడంతో స్పందించిన సాగర్ ఈ విషయాలను ఒంగోలు రిమ్స్ హాస్పటల్ లోని మెడికల్ కాలేజీ లోని అనాటమీ డిపార్ట్మెంట్ హెచ్‌ఓడి మరియు వైద్యకళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిరుతోటి సుధాకర్‌బాబు దష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డాక్టర్ సుధాకర్‌బాబు దుర్గమ్మ పార్థివ దేహాన్ని ఆమె భర్త అంగీకార పత్రం ద్వారా ఒంగోలు రిమ్స్ వైద్య కళాశాలకు అప్పగించారు. మూడేళ్ల బాబు సంరక్షణ నిమిత్తం హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బివి సాగర్ జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్ కుమార్ దృష్టికి తీసుకుని వెళ్ళగా వెంటనే స్పందించిన దినేష్ కుమార్ ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ వద్దకు చేరుకుని పోలయ్య పరిస్థితిని, బాబు పరిస్థితిని తెలుసుకుని ప్రత్యేక చొరవ తీసుకుని ఈ విషయాన్ని వెంటనే జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. హెన్నా సుజన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యులు బి. పద్మావతి, జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యులు నీలిమ దృష్టికి తీసుకెళ్లారు. బాబు సంరక్షణ నిమిత్తం తండ్రి పోలయ్య అంగీకారం ద్వారా బాబును జిల్లా బాలల సంక్షేమ కమిటీ వారి ఆదేశాల మేరకు ఒంగోలు రాంనగర్‌లోని శిశు గృహలో చేర్పించారు. 'నాకు ఆశ్రయం కల్పిస్తున్న మీకు నమస్కరిస్తున్నా..' అని బాలుడు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారికి, రెండు చేతులెత్తి నమస్కరించటం పలువురిని కంటతడి పెట్టించింది.

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

పర్యావరణాన్ని పరిరక్షణ బాధ్యత అధికారులదే..

కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జలవనరుల సమీపంలోని భూములు, పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి చెప్పారు. తడి భూమి సంరక్షణ జిల్లాస్థాయి కమిటీ సమావేశం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగింది. తడి భూమి సంరక్షణపై కమిటీలోని అధికారులు బాధ్యత వహించాలని కలెక్టర్ తెలిపారు. జలవనరులను సంరక్షిస్తేనే తడి భూమిని భద్రంగా ఉంచగలమన్నారు. భావితరాలకు జల వనరులు, వాటి వెంట ఉండే తడి భూమిని సంరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తడి భూములను సంరక్షించాలని సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలను విధిగా పాటించాల్సి ఉందన్నారు. జిల్లాలో 601 తడి భూములు ఉన్నాయన్నారు. అటవీ ప్రాంతంలో 42 ఉండగా, రెవిన్యూ పరిధిలో 53, జల వనరుల శాఖ పరిధిలో 230, మత్స్యశాఖ పరిధిలో 76 ఉండగా, పంచాయితీ, ఆర్డబ్ల్యూఎస్ పరిధిలో 128 చెరువులు ఉన్నాయన్నారు. ఉప్పు ప్రాంతాలలో నాలుగు చెరువులు ఉన్నాయన్నారు. అలాంటి తడి భూములను వాణిజ్య అవసరాలకు వినియోగించరాదన్నారు. అలాంటి భూముల చుట్టూ రసాయనాల వినియోగం నిషేధమన్నారు. ఆ ప్రాంతాలలో చెత్త వేయడం, వ్యర్థాలను కుప్పగా వేయరాదన్నారు. పక్షులను చంపడం, జీవాల ఖళేబరాలను సమీపంలో వేయరాదన్నారు. ఆక్వా సాగు, ప్రాసెసింగ్ యూనిట్లు, రసాయనాలు వెలువడే ఫ్యాక్టరీలు ఆ ప్రాంతాల్లో నిషేధం అన్నారు. సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాలను అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాలలోని తడి భూములలో మడ అడవులను వృద్ధి చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల అమలుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అటవీ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. సమావేశంలో అటవీశాఖ అధికారి వినోద్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న సర్దార్‌బాషా

కేన్సర్ పేషెంట్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గుంటూరు, శారద కాలనీకి చెందిన ఎస్‌డి.అషఫ్‌భాషా నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆయనకు ముగ్గురు పిల్లలు. కేన్సర్ బారిన పడటంతో కుటుంబ పోషణ భారంగా మారింది. వైద్యానికి కూడా డబ్బులు లేక ఇబ్బంది పడుతూ సూర్యశ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ షహనాజ్‌ని సంప్రదించారు. స్పందించిన ట్రస్ట్ చైర్మన్ ఎంఎస్‌డి సుబ్బు, కిషోర్ సహకారంతో సెక్రటరీ ఎస్‌కె.సర్దార్ బాషా ద్వారా బుధవారం ట్రస్టు కార్యాలయంలో రూ.15 వేల చెక్కు అందజేశారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

'ఉపాస్' హాస్పిటల్ ఆధ్వర్యంలో 300 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ఉప్పుగుండూరులోని శ్రీ కమ్మవారి కల్యాణ మండపం వారి ఆధ్వర్యంలో ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, లయన్స్ క్లబ్ సహకారంతో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది. మాజీ సిఎం నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా ముప్పవరపు వీరయ్యచౌదరిని స్మరించుకుంటూ.. ఏర్పాటుచేసిన ఈ వైద్యశిబిరంలో 300 మందికి షుగరు, బిపి, ఈసిజి, గుండె సంబంధ వైద్యపరీక్షలు ఉచితంగా చేశారు. మందులు కూడా అందజేశారు. వైద్యశిబిరంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రీధర్ చివుకుల, ఎండోక్రైనాలజీ డాక్టర్ జయవర్ధన్ ఉల్చి, ఎముకలు మరియు కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, రెస్పిరేటరీ మెడిసిన్ మరియు ఛాతీ వైద్య నిపుణులు డాక్టర్ అనిల్ కుమార్, సాధారణ వ్యాధులు మరియు డయాబెటాలాజిస్ట్ డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాస్, స్త్రీ వైద్య, సంతాన సాఫల్య నిపుణురాలు డాక్టర్ ఎస్.రాధ పాల్గొన్నారు. మెగా వైద్యశిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి 15 రోజుల ఉచిత డాక్టర్ కన్సల్టేషన్ మరియు వైద్య పరీక్షలలో 50 శాతం రాయితీ అందిస్తున్నట్టు ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అనపర్తి శ్రీనివాస్ తెలియజేశారు. కార్యక్రమంలో కాట్రగడ్డ చంద్రబాబు, జనరల్ మేనేజర్ ఆనంద్, పిఆర్‌ఓ రాము పాల్గొన్నారు.

వైద్యసేవలందిస్తున్న డాక్టర్ ఉమాపతి-చౌదరి, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ అనిల్, డాక్టర్ శ్రీధర్

పండుగ వాతావరణంలో నిత్యావసరాల పంపిణీ

ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న

మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జూన్ ఒకటి నుంచి పండుగ వాతావరణం కల్పించి.. కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న తెలిపారు. ఒంగోలు రెవెన్యూ డివిజన్‌లోని అన్ని మండలాల చౌకధరల దుకాణాల డీలర్లతో ఆర్డీవో కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్డీవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ఎండియు వాహనాలు రద్దయిన దష్ట్యా, డీలర్లకు రేషన్ షాపుల నిర్వహణ, నిత్యావసర సరుకుల పంపిణీపై అవగాహన కల్పించారు. 65 సంవత్సరాలు దాటిన వద్ధులకు, దివ్యాంగులకు డీలర్లు వారి ఇంటివద్దకే సరుకులు పంపిణీ చేయాలన్నారు. ప్రతినెలా ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ షాపు వద్దనే కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి 8 గంటల వరకు పంపిణీ చేయాలన్నారు. ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌ను లీగల్ మెట్రాలజీ వారిచే తనిఖీ చేయించుకొని ధ్రువీకరణ పత్రాలు పొందాలని తెలిపారు.

ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో మురళీకృష్ణ

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు మండలం, ఉలిచి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు జయంతి కార్యక్రమం ఘనంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ కమ్మవారి సేవా సమాఖ్య ట్రస్ట్ చైర్మన్ మండవ మురళీకృష్ణ పాల్గొని.. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా మాజీ అధ్యక్షుడు చుంచు శేషయ్య, ఉలిచి గ్రామ అధ్యక్షుడు చుంచు సింగయ్య, యర్రంనేని నరసింహారావు, వెంకట శేషయ్య, యర్రా అంజయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

తన భర్తను తీవ్రంగా అవమానించి ఆత్మహత్య యత్నానికి కారకులయిన మార్కాపురం సీఐ, లారీ ఓనర్ సుబ్బారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గిద్దలూరుకు చెందిన కందుల విజయలక్ష్మి కుటుంబ సభ్యులతో కలసి బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. విజయలక్ష్మి కథనం ప్రకారం.. గిద్దలూరుకు చెందిన కందుల సురేంద్రరెడ్డి మార్కాపురానికి చెందిన దేవిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి వద్ద ఐదు నెలల క్రితం లారీ కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనికి రూ.1.50 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించారు. సదరు లారీ తెచ్చుకుందామనుకున్న తరుణంలో లారీ గతంలో యాక్సిడెంట్‌కు గురైందని గుర్తించి, లారీ వల్ల నష్టం వస్తుందని భావించిన సురేంద్ర లారీ అవసరం లేదని తన అడ్వాన్స్ అమౌంట్ తిరిగి ఇవ్వాలని సుబ్బారెడ్డిని కోరాడు. రెండు నెలలు గడిచినా సుబ్బారెడ్డి స్పందించకపోవడంతో తప్పని సరై లారీ తెచ్చుకుని, 3 నెలలు తిప్పుకున్నామని, 3 నెలలు కిస్తీలు కట్టామని పేర్కొన్నారు. కాగా ఫైనాన్సర్లు లారీ తీసుకుని వెళ్లడంతో, తమకు లారీ కలసిరాదని భావించిన సురేంద్ర తమ అడ్వాన్స్ అమౌంట్ తిరిగి ఇవ్వాలని సుబ్బారెడ్డిని కోరారు. ఈ విషయం పై ఈ నెల 24న మార్కాపురం సీఐ తన భర్త సురేంద్ర ను పిలిపించి తీవ్రంగా దుర్భాషలాడటం వల్ల ఆ రాత్రి తన భర్త అవమానభారంతో ఇంటికి వచ్చి పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నం చేశారన్నారు. ఆయన నంద్యాల ప్రైవేట్ ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నట్లు తెలిపారు. ఈ విషయంపై 27న గిద్దలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా స్థానిక ఎస్ఐ తన పట్ల అనుచితంగా ప్రవర్తించాడని విజయలక్ష్మి ఆరోపించారు. తన భర్తను వేధించిన మార్కాపురం సీఐతో పాటు లారీ యజమాని సుబ్బారెడ్డి, గిద్దలూరు ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని, తన భర్తకు మెరుగైన వైద్యం అందించాలని ఆమె కోరారు. ఆమె వెంట ఆమె అత్త సుజాత, తల్లి వెంకటలక్ష్మి, మరిది నరేంద్రరెడ్డి, పాప, బాబు ఉన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబం

పంట రుణాల రెన్యువల్‌లో మెలిక..

- బంగారు రుణాలు మొత్తం చెల్లిస్తేనే రెన్యువల్ అంటున్న బ్యాంకర్లు
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రైతులు గతంలో బ్యాంకుల్లో వ్యవసాయ, బంగారు రుణాల రెన్యువల్ విషయంలో అప్పటి వరకు అయిన వడ్డీ చెల్లిస్తే మరుసటి ఏడాదికి రెన్యువల్ చేసేవారు.రైతు తాను పండించిన పంట అమ్ముడుపోని సందర్భాల్లో వడ్డీ వరకు చెల్లించి కొత్తగా రుణం పొందినట్లుగా చేసుకునే సౌలభ్యం గతేడాది వరకు ఉంది.ఇప్పుడు కొత్త నిబంధనల పేరుతో బ్యాంకర్లు రైతులకు సంబంధించి వ్యవసాయ, బంగారు రుణాల రెన్యువల్ విషయంలో రుణాలు మొత్తం చెల్లిస్తేనే రెన్యువల్ అంటూ చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.జిల్లాలో ఏటా రూ 8 వేల కోట్ల వ్యవసాయ రుణాలను బ్యాంకులు ఇస్తుండగా వాటిలో సుమారు రూ 3 వేల కోట్ల వరకు బంగారు రుణాలు ఉంటున్నాయి.ఇలా వ్యవసాయం కోసం బంగారు రుణాలు పొందిన రైతులు బ్యాంకులు కొత్తగా తెచ్చిన నిబంధనల కారణంగా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ప్రధానంగా ఈ ఏడాది జిల్లాలో పొగాకు సాగు చేసిన రైతులు సదరు పొగాకును కంపెనీల వారు కొనక పోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.90 శాతం పొగాకు నిల్వలు రైతుల వద్దే ఉన్నాయి.ధాన్యం కొనుగోళ్ళలో కూడా రైతులు ఇబ్బందులు పడుతూ వచ్చారు.అపరాలు సాగు చేసిన రైతులు కూడా సరైన ధర లేక ఇక్కట్లు పడుతూ వచ్చారు. సహజంగానే రైతులు పంటల సాగులో వ్యవసాయ ఖర్చుల కోసం తమ ఇళ్ళలో ఉన్న బంగారాన్ని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందుతారు.పంట చేతికి వచ్చాక,అమ్మకాలు జరిపి బ్యాంకుల్లో రుణ చెల్లింపులు జరిపే వారు. కాని ఈ ఏడాది పంటల సాగు రైతులకు కష్టనష్టాలను తెచ్చింది.మిర్చి.పత్తి,శనగ పంటల సాగు నష్టాలు తేవడంతో అత్యధికులు ఈ ఏడాది పొగాకు సాగు చేశారు. కాని పొగాకు పంట అమ్ముడుపోలేదు.పంట అంతా రైతుల వద్దే ఉంది.కాని బ్యాంకర్లు మాత్రం వ్యవసాయ రుణాలు మొత్తం చెల్లించాలని చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తాము తీసుకున్న బంగారు రుణంపై వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకునేందుకు రైతులు బ్యాంకులకు వెళ్ళగా అలా కుదరదని చెబుతున్నారు.పొగాకు అమ్ముడుపోక లక్షల అప్పుల్లో ఉన్న రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న మొత్తం రుణం వడ్డీతో సహ చెల్లించాల్సి రావడంతో రైతులు ఇక్కట్ల పాలవుతున్నారు.మరలా అప్పు చేసి రుణం చెల్లించినా తిరిగి బ్యాంకరు రుణం ఇస్తారన్న గ్యారెంటీ ఏమి ఉండడం లేదు.ఈసమస్య అత్యధికంగా పొగాకు సాగు చేసిన రైతు కుటుంబాల్లో ఉంది.జిల్లాలో అత్యధికంగా 69 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేసిన రైతులు కంపెనీలు చేసిన మోసం ఫలితంగా పొగాకు అమ్ముడు పోగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు.ప్రభుత్వం ఏమి చెప్పినా, మంత్రులు పర్యటనలు చేసినా ఫలితం శూన్యంగా ఉంది.ఈ నేపథ్యంలో గత సంవత్సరం బంగారు రుణాలపై ఇచ్చిన పంట రుణాలను వడ్డీతో సహ వెంటనే కట్టాలని బ్యాంకులు తీవ్రంగా తమపై ఒత్తిడి చేస్తున్నాయని రైతులు చెబుతున్నారు.పొగాకు అమ్ముడు పోక కూలీలకు సైతం డబ్బులు ఇవ్వలేని స్థితిలో తాము ఉన్నామని, అందువలన పొగాకు అమ్మేంతవరకు రుణాల వసూలు బ్యాంకులు వాయిదా వేయాలని లేదా రెన్యువల్ చేయాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి - రేపల్లె

జూన్ 1న స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో జిల్లా స్థాయి టైక్వాండో పోటీలు, రాష్ట్రస్థాయి సెలక్షన్స్ జరుగుతాయని టైక్వాండో అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ కె జగన్మోహనరావు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజు ఫోటో, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం వెంట తీసుకుని ఉదయం 8 గంటలకు కాలేజీ ప్రాంగణంలో జరిగే పోటీలకు హాజరు కావాలని కోరారు. ఈ పోటీలు న్యూ ఎపి తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన అభ్యర్థులు రాష్ట్ర స్థాయిలో జూన్ 9, 10, 11 తేదీల్లో అనంతపురంలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు.

పొగాకు రైతుల కోసం టోల్‌ఫ్రీ

ప్రజాశక్తి పర్చూరు

స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ కార్యాలయంలో జిల్లాలోని నాలుగు సబ్ డివిజన్‌లైన పర్చూరు, మార్టూరు, అద్దంకి, చీరాలలోని 12 మండలాలకు చెందిన రైతులు, పొగాకు పంటను వివిధ కంపంపెనీలకు అమ్మేటపుడు ఏదైనా సమస్యలు ఉంటే స్థానిక ఎడిఎ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 8331057095 కు కాల్ చేసి సహాయం పొందవచ్చని ఎడిఎ ఎన్ మోహనరావు తెలిపారు. ఈ టోల్ ఫ్రీ నంబరు ఉదయం 6.00నుండి రాత్రి 9వరకు పని చేస్తుందని తెలిపారు. రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తిస్తున్న ఎంఈఓ

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలపై దృష్టి

ప్రజాశక్తి - పంగులూరు

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలపై ప్రత్యేకమైన దృష్టి పెట్టి వారిని అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎంఇఒ2 జి వీరాంజనేయులు తెలిపారు. బుధవారం ఇంటింటికి తిరిగి సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గలవారి కోసం ఈ నెల 13 నుండి జూన్ 9వరకు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. సర్వేలో 0 నుండి 18ఏళ్లలోపు వయసు గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తిస్తామని అన్నారు. వీరిలో బడి ఈడు కలిగిన పిల్లలను బడిలో చేర్పించి వారికి అవసరమైన ప్రత్యేక సౌకర్యాలతో పాటు విలువలతో కూడిన విద్య అందిస్తామని చెప్పారు. ఈ పిల్లలు వారి దైనందన జీవితంలో వారి కార్యక్రమాలు వాళ్లే చేసుకోగలిగే విధంగా భవిత కేంద్రాల్లో తీర్చి దిద్దుతామని తెలిపారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలు, సదుపాయాలను వినియోగించుకుని చెప్పారు. వారిలో మనోధైర్యం నింపి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. భవిత కేంద్రాలు అలాంటి వారికి చాలా ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు 21 రకాలుగా ఉన్నారని, వారికి ప్రభుత్వం విద్యా కిట్లు అందిస్తుందని తెలిపారు. వివిధ రకాల అలవెన్సులు అందించటం, పరికరాలు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్, ట్యాబులు, క్రచర్స్ ఉచితంగా సమగ్ర శిక్ష అందిస్తారని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. అందుకు ప్రత్యేక డ్రైవ్ తీసుకొని ఇంటింటి సర్వే ప్రారంభించామని, ఇందులో భాగంగా ఐఈ రిసోర్స్ ఉపాధ్యాయులు పి యోహాను, టి అరుణ ఈపాటికే ఆరుగురు ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించారని అన్నారు. చిన్నారులకు అవసరమైన విద్యా కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. వీటి ద్వారా మెరుగైన విద్యావకాశాలు వస్తాయని అన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సమాచారం తెలిపిన వాళ్లు, అంగన్వాడి, సచివాలయ సిబ్బంది వారిని అడిగి ఎవరైనా ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉంటే 9100996448 నంబరులో సంప్రదించాలని కోరారు.

బ్యాంకులను బురిడీ కొట్టించిన ఆర్‌పీ

ప్రజాశక్తి - అద్దంకి

మెప్మా కార్యాలయంలో ఆర్‌పిగా పనిచేస్తున్న మలాది గాయత్రి ఆదర్శ పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉంటూ గ్రూప్ లీడర్లు, సంఘ సభ్యులకు తెలియకుండా దొంగ సంతకంతో కెనారా బ్యాంకు నందు రూ.4లక్షల ఋణం తీసుకున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై సభ్యులు ఆమెను ప్రశ్నించగా అంగీకరించింది. గ్రూపు తీర్మానం పుస్తకాలు, బ్యాంకు పుస్తకాలు ఇంట్లో పెట్టుకుని గ్రూప్ సభ్యులను బురిడి కొట్టించగా గ్రూప్ లీడర్లు అనుమానం వచ్చి బ్యాంకుకు వెళ్లి స్టేట్మెంట్ తీసుకోవడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. రూ.4లక్షల ఋణం తీసుకున్నట్లు రికార్డులో ఉన్నది. సభ్యులకు ఈ విషయం తెలియడంతో విస్తు పోయారు. ఈ విషయంపై ఆర్‌పి ఇంటికి వెళ్ళి నిలదీయగా తప్పు చేసానని ఒప్పుకుందని, వెంటనే సభ్యులు అందరూ కార్యాలయంకు వెళ్ళగా ఆమెతో పాటు అంజమ్మ అనే మహిళ కలసి కొన్ని గ్రూపుల మీద రూ.లక్షలు డ్రా చేసినట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. గ్రూపు సభ్యులు అడుగుతుంటే నెల సమయం ఇవ్వండని, తీసుకున్న సొమ్ము కడతామంటూ బెదిరించటం జరిగుతుందని సభ్యులు వాపోతున్నారు. ఈ విషయంపై మెప్మా అధికారి సభ్యులను కార్యాలయంలో సమావేశపర్చి బాధితురాలు నుండి నగదు వసూలు చేయడానికి ప్రాంసరీ నోట్లు వ్రాయించి సభ్యులకు భరోసా కల్పించారు. వచ్చేనెల 10లోపు తీసుకున్న బాకీ చెల్లిస్తారని బాధ్యురాలు వారందరికీ హామీ ఇవ్వడంతో ఈ విషయం ఇంతటితో సద్దుమణిగింది.



ఆర్పీని విచారిస్తున్న మెప్మా అధికారి

మెప్మా అధికారి శ్రీలత వివరణ

ఆర్‌పి గాయత్రి సభ్యులను మోసగించి సిసిలో రూ.4లక్షల నగదు డ్రా చేసిందనే విషయం తెలిసిన వెంటనే ఆమెను కార్యాలయానికి పిలిపించి సభ్యులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మునుముందు ఇటువంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

రహదారి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఇంకొల్లు

పర్చూరు, ఇంకొల్లు పాత మద్రాసు రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేసి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు కొబ్బరి కాయలు కొట్టి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. గత వైసిపి పాలనలో రోడ్డు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రజలు వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడడంతో శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవతో ప్రభుత్వం రోడ్డు నిర్మాణ పనులకు అనుమతి ఇచ్చారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.23.88 కోట్లు మంజూరు చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలని ఆదేశించారు. రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన కృషిని కొనియాడారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయన్నారు. పాత మద్రాసు రోడ్డు నిర్మాణానికి నిధులు సాధించేందుకు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు రోడ్లు, భవనాల శాఖ మంత్రితో చర్చించి రోడ్డు దుస్తిని వివరించి నిధులు సాధించినట్లు తెలిపారు. గత తెలుగేదశం ప్రభుత్వంలో మంజూరైన రోడ్డును వైసిపి నేతల చర్యల కారణంగా పనులు నిలిపేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక కృషితో నిలిచిన రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని ఆనందం వ్యక్తం చేశారు. నాణ్యత ప్రమాణాలతో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పర్చూరు అధ్యక్షుడు శంషుద్దీన్, తెలుగుదేశం రాష్ట్ర నాయకులు పాలేరు రామకృష్ణ, బోడంపూడి సుబ్బారావు, బేతపూడి సురేష్, కృష్ణయ్య, గుంజి వెంకట్రావు, బోడావుల శివయ్య, శ్రీనివాసరావు, కొల్లూరి శివాజీ, చిలుకూరి శ్రీనివాసరావు, మల్లేశ్వరి పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

శక్తి యాప్‌పై అవగాహనా కల్పిస్తున్న పోలీసులు

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - చీరాల

చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సిసి క్యాంపులో ఎన్‌సిసి క్యాడేట్స్‌కు చీరాల సబ్ డివిజన్ పరిధి లోని శక్తీ టీం సభ్యులు కె సుబ్బారావు, ధనలక్ష్మి, ఎం సునీత చే శక్తీ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ శక్తీ యాప్ ఆపదలో ఉన్న మహిళలకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. డైల్ 100, 112 ద్వారా గ్రీవెన్స్‌ను పెట్ట వచ్చని వివరించారు. ఫిర్యాదులు, మిస్సింగ్ కేసులు, కిడ్నాప్ కేసు లు, నైట్ షెల్టర్ వంటి పలు ప్రయోజనాలు పొందవచ్చని క్యాడేట్స్‌కు వివరించారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ నజీర్ అహ్మద్, మేజర్ బిఎస్‌ఆర్‌కె రాజు, హరీష్, ప్రసాద్, రాజేష్, పి సురేష్, టి వెంకటేశ్వర్లు, సిహెచ్ సుబ్బారావు, బి శ్రీని వాస్, బిహెచ్‌ఎం రమేష్, ఫాతిమా, దివ్య, సుబేధర్ ముకేష్, హావల్దార్ వీరేష్, పవన్ పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ప్రభుత్వం నిర్ణయాలు అమలు చేయని కంపెనీలు
- పొగాకు కొనే వారికోసం ఎదురు చూస్తున్న రైతులు
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు

ప్రజాశక్తి - పంగులూరు

నల్లబర్లి పొగాకు తక్షణం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు డిమాండ్ చేశారు. నల్లబర్లి పొగాకు కొనుగోలు చేయించాలని రైతు సంఘం గత రెండు నెలలుగా వివిధ రూపాల్లో నిరసన తెలియజేసిందని, దాని ఫలితంగా ప్రభుత్వం కదిలి కంపెనీలతో మంత్రులు, ముఖ్యమంత్రి, అధికారులు చర్చలు జరిపి రైతుల వద్ద ఉన్న నల్లబర్లి పొగాకు మొత్తం కొనాలని కంపెనీలకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. దీని గురించి తెలుసుకునేందుకు టోల్ ఫ్రీ నెంబర్లు కూడా ఇచ్చారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కంపెనీలతో చర్చలు జరిపినప్పుడు నాణ్యతను బట్టి క్వింటా రూ.12,500కు కొనాలని చెప్పారని, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు రైతు పండించిన పొగాకును రెండు గ్రేడ్లుగా చేసి మంచి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు

పొగాకు రూ.12వేలకు, లో గ్రేడు పొగాకు రూ.6 వేలకు కంపెనీలు కొనుగోలు చేయాలని ధర నిర్ణయించారని రామారావు చెప్పారు. కంపెనీలు పొగాకును నిలువ చేసుకునేందుకు ప్రాసెసింగ్ చార్జీలు రూ.150 కోట్లను ప్రభుత్వమే భరాయిస్తుందని చెప్పారని అన్నారు. అయితే ఇవేమీ అమలు జరగడం లేదని అన్నారు. గ్రామాల్లో పొగాకు అమ్ముకునేందుకు వ్యాపారస్తుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీలు మాత్రం యధావిధిగా టాప్ ఆకులను గ్రేట్ చేయించి బాగా ఉన్న చెక్కులను మాత్రమే గేట్ పాసులు ఇస్తున్నారని, పాసింగులో బాగా ఉన్న చెక్కులకు రూ.6వేల నుండి రూ.11వేలకు కొంటున్నారని చెప్పారు. బాగా లేని వాటిని వెనక్కి తిరిగి పంపిస్తున్నారని అన్నారు. రైతులు పొగాకు మండేలు కట్టి మూడు నెలలు అవుతుందని, ఇంతవరకు రైతులు కేజీ పొగాకు కూడా అమ్ముకోలేదని తెలిపారు. అకాల వర్షాలకు పొగాకు తడిసి చెడిపోతుందని రైతులు ఆందోళనలో ఉన్నారని అన్నారు. ఇంతవరకు కూలీలకు డబ్బులు కూడా ఇవ్వని పరిస్థితిలో కొంతమంది రైతులు ఉన్నారని తెలిపారు. ఒకవైపు అప్పుల వాళ్ళ ఒత్తిడి చేస్తున్నారని, మరలా పంట సాగు చేసే సమయం వస్తుందని, పిల్లల కాలేజీలు, స్కూళ్లకు చేర్పించాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో పొగాకు అమ్మితే గాని కుటుంబం నడిచే పరిస్థితి లేదని చెప్పారు. ఈపాటికి జిల్లాలో ఇద్దరు పొగాకు కౌలు ఆత్మహత్య చేసుకున్నారని, ఒక రైతు హాస్పిటల్‌లో వైద్యం చేయించుకుంటున్నాడని చెప్పారు. రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని కంపెనీలు కొంటాయన్న నమ్మకం రైతులకు లేదని, ఏడాదికి రూ.70 వేల కోట్ల పొగాకుపై పన్ను రూపేనా పొందుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొందుతున్నాయని, కొంతమేరకు నిధులను కేటాయించి, మార్కెఫెడ్ ద్వారా పొగాకును కొనుగోలు చేయాలని, రైతుల ఆత్మహత్యలు ఆపాలని డిమాండ్ చేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మాట్లాడుతున్న డిడిఓ పొట్లూరి పద్మావతి

ప్రజాశక్తి - అమృతలూరు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిశుభ్రత పాటించాలని డివిజనల్ డెవలప్మెంట్ అధికారి పొట్లూరి పద్మావతి సూచించారు. మండలంలోని గోవాడ తోపాటు మరో రెండు గ్రామాల్లో స్వచ్ఛందర, స్వర్ణాంధ్ర కార్యక్రమం గ్రామసభలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిడిఓ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత తోపాటు ఇంటి పరిశుభ్రత కూడా పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించవచ్చని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగా డే సందర్భంగా యోగ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎంపిడిఒ మారుతి శేషమాంబ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలకై ఆయా గ్రామాల్లో జరిగే గ్రామ సభల్లో ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని చెప్పారు. ప్లాస్టిక్ నిషేదంపై ప్రజలు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం తడి చెత్త పొడి చెత్త నిర్వహణకై చేపట్టిన షెడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పంగులూరు : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ ఎంపిడిఒ కె సుమంత్ అన్నారు. మండలంలోని ఆరికట్లవారిపాలెంలో బుధవారం జరిగిన పారిశుద్ధ్య నిర్వహణ, పిఎం సూర్యఘర్‌పై జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో స్వచ్ఛమైన విద్యుత్తు అందించి, ప్రజలకు సౌకర్యవంతమైన జీవనాన్ని కలిగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. తెలుగుదేశం నాయకులు మాగులూరి రమేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. గ్రామాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడంతోపాటు, మంచి వసతులు సౌకర్యవంతమైన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్న అన్నారు. పీఎం సూర్యగర్ పథకం ద్వారా ప్రజలకు తక్కువ ఖర్చుతో విద్యుత్తు అందటమే కాకుండా మిగులు విద్యుత్తు ప్రభుత్వానికి అమ్ముకునే అవకాశం ఉందని రమేష్ బాబు అన్నారు. ఈ పథకం పట్ల అవగాహన కలిగించుకొని ఉపయోగించుకోవాలని కోరారు. భవిష్యత్తులో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం జ్యోతి ప్రసాద్, తెలుగుదేశం నాయకులు వీరాంజనేయులు, తానికొండ దయా శేఖర్, పుల్లెల బుజ్జిబాబు పాల్గొన్నారు.

మేదరమెట్ల : మండలంలోని బొడ్డువానిపాలెంలో బుధవారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాన్ కార్యక్రమాన్ని సర్పంచ్ నేరెళ్ల సుబ్బయ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాజ్యలక్ష్మి ప్రజలకు అవగాహన కల్పించారు. కుటుంబాన్ని శుభ్రంగా ఉంచుకున్నట్లు మన వీధిని, గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకుంటే మంచి ఆరోగ్యం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కోటేశ్వరి, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పంగులూరు డిప్యూటీ ఎంపిడిఒ సుమంత్

మాట్లాడుతున్న మేదరమెట్ల ఎంపిడిఒ రాజ్యలక్ష్మి

వర్షాకాలంలో కాలువ నీటిలో పూడికతీత ప్రారంభం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వేసవికాలంలో చేపట్టాల్సిన పూడిక తీత పనులు వర్షాలు అధికమై కాలువల నిండా నీళ్లు ఉన్న సమయంలో పనులు చేపట్టడం వలన ఏమాత్రం ప్రయోజనం ఉండదని రైతులు ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వివిధ మురుగు కాలువల్లో పూడి తీసేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. దీనివలన నీటిలో ఏమాత్రం పార మట్టి కూడా వచ్చే పరిస్థితి లేదని, కాలువ అంచులు గీరీ కట్టపై వేయడం వలన కట్టలు కూడా బలపడే పరిస్థితి లేదని అంటున్నారు. గతేడాది ఖరీఫ్ సీజన్లో మురుగు కాలువలు పూడిపోవడంతో నాట్లు వేసిన కొద్దిరోజులకే కురిసిన అధిక వర్షాలకు పంటల పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాదైనా అధికారులు ముందుగానే కాలువలు కూడిక తీసి రైతులను ఆదుకుంటారని భావించినప్పటికీ ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు మురుగు కాలువలు, పంట కాలువలు నీటితో నిండిపోయి ఉన్నాయని, ఇలాంటి సమయంలో అధికారులు జెసిబి ద్వారా పూడిక తీత చేపట్టడం ఏ విధంగా సాధ్యమవుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. నీరు నిండుగా ఉన్న కాలువల్లో జెసిబిల

కాలువలో పూడికతీత పనులు చేస్తున్న ప్రొక్లైనర్

ద్వారా పనిని చేపట్టటం ఏమాత్రం పూడిక తీతకు ప్రయోజనం ఉండదని అంటున్నారు. ప్రస్తుతం అల్లూరు కాలువలో జెసిబి ద్వారా పనులు చేస్తున్నారని, ఆ పనులు ఏమాత్రం ప్రయోజనకరంగా ఉండదని చెబుతున్నారు. ఈపాటికే బాడవ పొలాల వైపు ఉన్న కాలువ కట్ట బలహీన పడిందని, దానిని బలపరచడనికి అవసరమైన మట్టి కాలువల నుండి తీసే పరిస్థితి లేకపోయిందన్నారు. అధిక వర్షాలు కురిస్తే అల్లూరు కాలువ కట్ట పోర్లిపోయి ఈ ఏడాది కూడా పొలాలు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని ఆ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భట్టిప్రోలు జగనన్న కాలనీ నుండి ప్రారంభమైన కనగాల అప్లుయెంట్ మురుగు కాలువ కూడా గుర్రపు డెక్కతో నిండిపోయి ప్రస్తుతం ఉపాధి కూలీల ద్వారా తొలగిస్తున్నప్పటికీ అది పూర్తిస్థాయిలో నిర్మూలన జరిగే పరిస్థితి లేదనీ ఆరోపిస్తున్నారు. గూడవల్లి, గంగోలు వరకు ఉన్న ఈ కాలువ పూర్తిగా గుర్రపు డెక్క, పూడికతీత పేరుకుపోయిన దృష్ట్యా కాలువల్లో పూర్తిగా నీరు నిల్వ ఉండి ఉపాధి హామీ కూలీలకు సైతం శరీరం మొత్తం దురదలు, దద్దుర్లతో అల్లాడుతున్నట్లు కూలీలు వాపోతున్నారు. ఈ గుర్రపు డెక్క తొలగించే పనికి వేతనం ఏ విధంగా ఇస్తారో అర్థం కావడం లేదని కూలీలు అంటుస్తున్నారు. ఈ విషయంపై మురుగు నీటి పారుదల శాఖ ఎఇ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మురుగు కాలువలు పూడికతీతకు అంచనాలు రూపొందించి ముందుగానే ప్రభుత్వానికి నివేదించామని, అయినప్పటికీ ప్రస్తుతం అత్యవసర పనుల కింద కలెక్టర్ నుండి ఒక్కొక్క కాలువకు రూ.లక్ష నుండి రూ.1.50లక్షల వరకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. వీటితో తాత్కాలికంగా నీరు ప్రవహించేందుకు కాలువలు శుభ్రపరుస్తున్నట్లు చెప్పారు.

మాట్లాడుతున్న డాక్టర్ కిషోర్

బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - బాపట్ల

కిషోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించడం పట్ల అత్యంత శ్రద్ధ వహించాలని రాష్ట్రీయ కిషోర స్వాస్థ్య ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కిశోర్ అన్నారు. బాలికలు, మహిళల్లో ఋతు శుభ్రత అనే అంశంపై మండలంలోని వెదుళ్ళపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు నిర్మూలించేందుకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. కిశోర బాలికలకు రజస్వల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ సంయుక్త సంచాలకులు, జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి రత్న మన్మోహన్, వెదుళ్ళపల్లి వైద్యాధికారి పి మానస ప్రియదర్శిని, సూపర్ వైజర్లు, ఓపి సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దంకమ్మ ఆదాయం రూ.6.64 లక్షలు

ప్రజాశక్తి - పర్చూరు

మండల కేంద్రమైన పర్చూరులో వేంచేసి ఉన్న శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మ వారి తిరుణాలకు రూ.6,64,837 ఆదాయం వచ్చినట్లు ఆలయం కార్యనిర్వాహణాధికారి దామా నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. ఇందులో భక్తుల విరాళాలు రూ.4,55,152, దర్శన టికెట్ల నుండి రూ.28,520 వచ్చినట్లు తెలిపారు. హుండీ విరాళాలు రూ.1,81,165 వచ్చినట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అమ్మవారి ఆదాయం రూ.76,856 అధికంగా వచ్చినట్లు తెలిపారు.

బీచ్ కబడ్డీ జట్టుకు శిక్షణ పొందుతున్న యువకులు

బీచ్ కబడ్డీ జట్టుకు శిక్షణ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

జూన్ 5 నుండి 8 వరకు మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్‌లో నిర్వహించనున్న 12వ జాతీయ బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర పురుషుల కబడ్డీ జట్టుకు మండలంలోని పొన్నపల్లి వద్ద శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎపి కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి, జిల్లా కబడి అసోసియేషన్ కార్యదర్శి ఎం సుబ్బరాజు తెలిపారు. పొన్నపల్లి వద్ద శిక్షణ శిబిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. నేటి నుంచి వచ్చే నెల 3వరకు రాష్ట్ర పురుషుల బీచ్ కబడ్డీ జట్టుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పొన్నపల్లికి చెందిన కుంచాల శ్రీనివాసరెడ్డి స్పాన్సర్ చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ వై శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీచ్ కబాడీ పోటీలకు పురుషులు కబాడీ జట్టు శిక్షణ పర్యవేక్షకులుగా విశ్రాంత పీడీలు వైఎస్ఆర్ ప్రసాద్, రాధాకృష్ణ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ శిక్షణా శిబిరానికి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణ, ఈస్ట్ గోదావరి జిల్లాల నుంచి 12 మంది క్రీడాకారులు వచ్చినట్లు తెలిపారు. అనంతరం వీరి నుంచి తుది జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ఎస్ఐ అమరవర్ధన్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కొల్లూరు

నూతన ఎస్ఐగా జె అమర వర్ధన్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. ఆయన అమృతలూరు పోలీసు స్టేషన్ నుంచి కొల్లూరుకు బదిలీ కాగా ఇక్కడ పనిచేసిన జి ఏడుకొండలు విఆర్‌కు వెళ్లారు.

జె అమర వర్ధన్

ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

అందరికీ ఆదర్శం..ఎన్టీఆర్ జీవితం

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నందమూరి తారక రామారావు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శం తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. స్థానిక బాపట్ల కలెక్టర్ కార్యాలయంలోని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ రైతు కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగారన్నారు. తెలుగు ప్రజల హృదయాలలో ఎన్టీఆర్ స్థిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. ప్రజల కోసం రెండు రూపాయలకే కిలో బియ్యం ప్రవేశపెట్టిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ లర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు ఎన్టీఆర్ జీవితం దర్పణం

క్రమశిక్షణ, కఠిన ఎన్టీఆర్ జీవితం దర్పణమని జిల్లా ఎస్పీ తుషార్ డూడి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా బుధవారం జిల్లా ఎస్పీ స్థానిక పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళి లర్పించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, సిఐ కె.శ్రీనివాసరావు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రలో

సభ్యత్వ నమోదు లక్ష్యాలను చేరుకోవాలి

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

యోగాంధ్రలో సభ్యత్వ నమోదు లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమాలు, సభ్యత్వ నమోదుపై జిల్లా మండలస్థాయి అధికారులతో బుధవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమాలు బాపట్ల జిల్లాలో జయప్రదంగా నిర్వహించడానికి ట్రైనర్లకు సమర్థంగా శిక్షణలు ఇవ్వాలని కలెక్టర్ చెప్పారు. సభ్యత్వ నమోదు, ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాలపై నిర్లిప్తంగా ఉండరాదని ఆదేశించారు. జూన్ 21వ తేదీన మెగా యోగా డే నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లాలో 6,31,435 మందిని సభ్యులుగా చేర్పాల్సి ఉండగా ప్రస్తుతం 1,21,213 మంది సభ్యులయ్యారన్నారు. సభ్యత్వ నమోదు జాప్యంపై మండల స్థాయిలోని అధికారులను ప్రశ్నించారు. 35 మంది యోగా గురువులను

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ఎంపిక చేశామన్నారు. యోగా గురువులు 180 మంది మాస్టర్ ట్రైనర్లకు జిల్లా స్థాయిలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మాస్టర్ ట్రైనర్లకు ఈ నెల 29 నుంచి జూన్ రెండో తేదీ వరకు శిక్షణలు కొనసాగుతాయన్నారు. మండల స్థాయిలో ఈనెల 31వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు శిక్షణలు ఇవ్వాలని ఆదేశించారు. తదుపరి సచివాలయాల సిబ్బందికి, సభ్యులుగా తమ పేర్లు నమోదు చేసుకున్న వారందరికీ జూన్ 3 నుంచి 18వ తేదీ వరకు శిక్షణలు ఇవ్వాలని సూచించారు. జాతీయస్థాయి కార్యక్రమం విశాఖపట్నంలో నిర్వహిస్తున్నందున అక్కడకు వెళ్లే వారిని ఎంపిక చేసి శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లాలో 477 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయన్నారు. అందులో 3,500 మంది సచివాలయాల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒక్కొక్కరూ 300 మందిని సభ్యులుగా చేర్పాలని ఆదేశించారు.

31నే పింఛన్ నగదు పంపిణీ

ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదు పంపిణీ ప్రక్రియను ఈనెల 31వ తేదీన ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. జూన్ ఒకటో తేదీన ఆదివారం సెలవు దినం కావడంతో ముందురోజు పింఛన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పింఛన్ పంపిణీ ప్రక్రియ జిల్లాలో సజావుగా సాగేలా అధికారులు ప్రణాళికతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. సమావేశంలో డి ఆర్ డి ఎ పి.డి. శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్ విజయమ్మ, డిపిఓ ప్రభాకర్ రావు, డిటిసి పరంధామరెడ్డి, ఎస్ఎస్ఏ ఏపీసీ నాగిరెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి కె పాల్ కుమార్ పాల్గొన్నారు.

సంరక్షణ కేంద్రాలు

చట్టప్రకారమే నడపాలి: కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాలల ఆశ్రమాలు, సంరక్షణ కేంద్రాలు చట్టప్రకారమే నడిపేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సిసిఐఆర్సి జిల్లా కమిటీ సమావేశం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగింది. బాలల సంరక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 23 బాలల ఆశ్రమాలు, సంరక్షణ కేంద్రాల లైసెన్సుల పునరుద్ధరణకు సంబంధించిన దస్త్రాలు పున్నపరిశీలన చేయాలన్నారు. ఆ సంస్థల పనితీరుపై క్షేత్రస్థాయిలో విచారించిన అధికారులు కమిటీకి నివేదించారు. కమిటీలోని సభ్యులైన జిల్లా అధికారులు సంబంధిత దస్త్రాల నివేదికను పరిశీలన చేయాలన్నారు. కమిటీ నివేదికను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. అనాథ బాలలకు ఆశ్రయం కల్పించే సంస్థలలో మౌలిక సదుపాయాలు, కనీస వసతులు, సిబ్బంది పనితీరు, అందిస్తున్న సేవలు, సంబంధిత దస్త్రాలను పరిశీలించిన తదుపరి

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

లైసెన్సులు ఇవ్వాలన్నారు. శిశు గృహంలో ఆశ్రయం పొందుతున్న అనాథ శిశువులను దత్తతతో తల్లిదండ్రుల వద్దకు చేర్చాలన్నారు. ఇందుకోసం సిడబ్ల్యుసి అనుమతులు పొందాలన్నారు. బాలల సంక్షేమం, సంరక్షణ ప్రభుత్వమే బాధ్యత వహిస్తున్నారు. వారి హక్కులకు భంగం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జువెనల్ జస్టిస్ సంక్షేమ ప్రొబేషన్ అధికారిణి సౌందర్య, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ పీడీ రాధా మాధవి, వికలాంగుల శాఖ ఏడీ అర్చన, వివిధ శాఖల జిల్లా అధికారులు, డిసిపిఓ పురుషోత్తమరావు, బాలల సంరక్షణ, సంక్షేమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిజిపికి స్వాగతం పలుకుతున్న ఎస్పీ ఏఎస్పీ

డిజిపిని కలిసిన ఎస్పి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విజయవాడ నుండి కడపకు వెళుతూ మార్గమధ్యంలో ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయంలోని అతిథిగృహానికి రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్‌గుప్తా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను ప్రకాశం జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్, పోలీస్ అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. డిజిపికి ఎస్పి పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. డిజిపితో పాటు ఇంటెలిజెన్స్ అదనపు డిజిపి మహేష్ చంద్ర లడ్డా, అదనపు డిజిపి (లా అండ్ ఆర్డర్) ఎన్.మధుసూదన రెడ్డి ఉన్నారు. డిజిపిని కలిసిన వారిలో అదనపు ఎస్పి (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్పి ఆర్.శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్పి శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ వి.సూర్యనారాయణ, ఒంగోలు వన్ టౌన్ సిఐ నాగరాజు, ఒంగోలు టు టౌన్ సిఐ ఎం.శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా సిఐ విజయకృష్ణ, రూరల్ సిఐ యన్.శ్రీకాంత్ బాబు, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఎస్సైలు ఉన్నారు.

రద్దీ ప్రదేశాలలో శక్తి బృందాల గస్తీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మహిళల భద్రతే ప్రధాన లక్ష్యంగా శక్తి బందాలు ముమ్మరంగా గస్తీ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని మహిళలకు రక్షణగా ఉండేందుకు సిఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతి సబ్ డివిజన్ పరిధిలో శక్తి బందాలను ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లాలో మొత్తం నాలుగు శక్తి బందాలు విధులు నిర్వహిస్తు న్నాయి. ఎస్పీ ఆదేశాలతో బుధవారం శక్తి బృం దాలు రద్దీ ప్రదేశాలలో, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో ముమ్మరంగా గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, రక్షణ కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన శక్తి యాప్ ఆవశ్యకత, దాని ద్వారా అందించే సేవలు, నిక్షిప్తం చెయ్యబడిన సమాచారం, రిజిస్ట్రేషన్ చేసుకొనే విధానం తదితర విషయాల గురించి మహిళలకు, విద్యార్థులకు విస్తతస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా నూతనంగా ప్రారంభించిన శక్తి వాట్సాప్ నెంబర్ 79934 85111 గురించి అవగాహన కల్పించారు.

రాష్ట్రాన్ని మొదటిస్థానంలో నిలపటమే

ఎన్టీఆర్‌కు ఇచ్చే ఘన నివాళి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని, దేశ, ప్రపంచ స్థాయిలో మొదటి స్థానంలో నిలపడమే స్వర్గీయ నందమూరి తారక రామారావుకు ఇచ్చే ఘనమైన నివాళి అని జిల్లా కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జయం తిని పురస్కరించుకుని బుధవారం ఉదయం ఒంగోలు అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, జెసి ఆర్ గోపాల క్రిష్ణ, పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ గా నియమితులైన డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒం గోలు ఆర్డిఒ లక్ష్మీ ప్రసన్న, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులతో పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో జరిగిన జయంతి కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించారన్నారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసిన సేవలను, సినీ రంగ అభివృద్ధికి చేసిన కృషిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. అభివృద్ధి పథంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలపడమే వారికి మనం ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. జెసి ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ,

ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ తమీమ్అన్సారియా

నందమూరి తారక రామారావు జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవడం హర్షణీయమ న్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరిం చాయి. ఈ సందర్భంగా నందమూరి తారక రామారావు జీవిత చరిత్ర పై సమాచార పౌర సంబంధాల శాఖ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను కలెక్టర్, అధికారులు, ప్రజలు ఆసక్తి గా తిలకించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలో పాల్గొన్న వారికి కలెక్టర్ మెమోంటోలను అందచేసారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, మెప్మా పీడీ శ్రీహరి, స్టెప్ సిఇఒ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

మహానాడులో మాట్లాడుతున్న గొట్టిపాటి

చంద్రబాబుకు శుభాకాంక్షలు

టిడిపి జాతీయ అధ్యక్షుడిగా మరోమారు ఏకగ్రీవంగా ఎన్నికైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ఉమ్మడి ప్రకాశం జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు కడప మహానాడులో శుభాకాంక్షలు తెలియజేశారు. శు భాకాంక్షలు తెలియజేసిన వారిలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, కొండయ్య, పర్యాటక సంస్థ ఛైర్మన్ డాక్టర్ బాలాజీ, ఇన్‌ఛార్జులు ఎరిక్షన్‌బాబు, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, నేతలు లలిత్‌సాగర్, చల్లా శ్రీనివాసరావు ఉన్నారు.